మానేరు **జనత**®
తెలుగు దినపత్రిక · ఇది జనం గొంతుక

18.4.2026 శనివారం Saturday · సంపుటి (Volume): 10 · సంచిక (Issue) : 358 · పేజీలు : 8 Pages : 8 · వెల : 2 · Published from : Karimnagar

ఇదే మా ఆహ్వానం
ప్రజలు, ప్రభుత్వానికి మధ్య వారధి మీడియా
ప్రజా సమస్యలను వెలికితీసి..
వాటి పరిష్కారానికి పునాది వేసేది మీడియా
మీ సమస్య ఏదైనా మీ తరుపున నిలబడి
అటు అధికారులను గానీ,ఇటు రాజకీయ నాయకులను గానీ
నిలదీస్తూ, నిజాన్ని నిగ్గు తేలుస్తుంది జనతా..
రండి..మీ కలాన్ని కదపండి..
మీ గళాన్ని వినిపించండి.
అందరం కలిసికట్టుగా..
"జనతా"తో కలిసి ప్రజా సమస్యలపై పోరాడుదాం..!!
మొక్కవోని దీక్షతో పని చేద్దాం.. తగ్గేదేలే..!
జనం కోసం "జనతా"..
7989867251
- ఎడిటర్

## టైటాన్స్ హ్యాట్రిక్..







## 2023లోనే ఆమోదించిన బిల్లును అమలు చేయండి

- లేదా కొత్తగా మహిళా బిల్లును తీసుకుని రండి
- ప్రస్తుత బిల్లు మహిళా సాధికరత కోసం పెట్టింది కాదు
- ఆ ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం
- బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల క్రూర చర్య
- చర్చలో మోడీ ఓ మెజీషియన్ అంటూ రా హుల్ తీవ్రంగా విమర్శలు
- రాహుల్ తీరుపై మండిపడ్డ స్పీకర్ బిర్లా.. కేంద్రమంత్రులు



## రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం

బ్రిటన్ పౌరసత్వం కలిగి ఉన్నట్లు ఆరోపణలు
విచారణకు ఆదేశించిన అలహాబాద్ హైకోర్టు

.. వివరాలు 2లో

# బిల్లుకు బ్రేక్



### వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు

- 131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం
- అనుకూలంగా 278..వ్యతిరేకంగా 211 ఓట్లు
- రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు
- ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి
- ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం

మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు.

04

## మహిళా సాధికారత కోసమే మా ప్రయత్నం

- ఉత్తర దక్షిణ పేరుతో బిభజన సరికాదు
- ఈ దేశంలో అన్ని ప్రాంతాల వారికి సమాన హక్కులు
- డీలిమిటేషన్‌తో ఎస్సీ,ఎస్టీ సీట్లు పెరుగతాయి
- వారి సీట్ల పెపును అడ్డుకోవడం సరికాదు
- లోక్‌సభలో చర్చకు సమాధానం ఇచ్చిన అమిత్ షా

## జాతీయ విపత్తును నివారించిన రోజు

- రాహుల్ నేతృత్వంలో విపక్షాలు ఐక్యత చాటాయి
- ఇందుకు సహకరించిన విపక్ష నేతలకు కృతజ్ఞతలు
- ఎక్స్ వేదికగా పోస్ట్ చేసిన సీఎం రేవంత్ రెడ్డి



**జనతా న్యూస్,న్యూఢిల్లీ :** ఇవాళ జాతీయ విపత్తును నివారించిన రోజు అని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ప్రజాస్వామ్య శక్తులు, ప్రతిపక్షాలు కలిసి జాతీయ విపత్తును నివారించాయన్నారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ల అమలు కోసం కేంద్రం తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన నేపథ్యంలో రేవంత్‌రెడ్డి స్పందించారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే నేతృత్వంలో జాతీయ విపత్తును అడ్డుకున్నారు. దేశ చరిత్రలో సువర్ణదినంగా ఇవాళ గుర్తుండిపోతుంది. నల్ల బిల్లులను ఓడించేందుకు ఏకమైన మిత్రపక్షాల నేతలకు ధన్యవాదాలు అని రేవంత్‌రెడ్డి 'ఎక్స్'లో పోస్టు చేశారు. లోక్‌సభలో చోటుచేసుకున్న తాజా పరిణామాలపై తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సోషల్ మీడియా

మిగతా 2 లో

## 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వినతి

02

## పదేళ్లు అధికారంలో ప్రజలను ఎందుకు కలవలేదు



- ఇప్పుడే పాదయాత్ర చేయాలని ఎందుకనో
- కెటిఆర్‌పై విమర్శలు గుప్పించిన కవిత
- ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని నిదీస్తాం
- జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

03



## ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

- హోర్మూజ్ జలసంధి తెరిచి ఉంటుందని ప్రకటన
- ఇరాన్ ప్రకటనతో భారీగా తగ్గిన ఆయిల్ ధరలు

## యుద్ధానికి అతిత్వరలో ముగింపు

- ఇరాన్ ఒప్పందం కోరుకుంటోంది
- సంధి కుదిరే వీలుంటే ఇస్లామాబాద్ వెళ్తాను మీడియాతో ట్రంప్
- 40 దేశాల సమావేశం.. యురేనియంపై రాజీ కుదిరే అవకాశాలు

.. వివరాలు 2లో

## ఉత్తరాది, దక్షిణాది పేరుతో విషం చిమ్ముతున్నారు

- రేవంత్‌ది అసదుద్దీన ఓవైసీ ఫార్మాలా
- కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి

దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ పక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు.

03



## సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

- కోటి పరిహారం హామీ ఇచ్చి మరచిన సీఎం
- మరోమారు మండిపడ్డ హరీశ్ రావు



03



## తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

03 మంత్రి పొన్నం వ్యాఖ్యలపై బండి మండిపాటు

# కాళేశ్వరంపై ఎలాంటి దురుద్దేశ్యం లేదు

**నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ జైన్‌తో చర్చించాం**

**వానాకాలం లోగానే సాయిల్ టెస్టింగ్ పూర్తి**

**20న సిఎం రేవంత్ మేడిగడ్డను పరిశీలిస్తారు**

**నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి**



**న్యూఢిల్లీ,ఏప్రిల్17 :** కాళేశ్వరం ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డికి, తమ ప్రభుత్వానికి ఎలాంటి దురుద్దేశం లేదని తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. ఈనెల 20వ తేదీన సీఎం రేవంత్‌రెడ్డితో కలిసి మేడిగడ్డ బ్యారేజ్‌ను పరిశీలిస్తామని పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో మంత్రి ఉత్తమ్ మీడియాతో మాట్లాడారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ చైర్మన్ అనిల్ జైన్‌తో కాళేశ్వరం ప్రాజెక్టు, మేడిగడ్డ బ్యారేజ్ మరమ్మతులు, పునరుద్ధరణపై చర్చించామని తెలిపారు. గోదావరి వరదలు వచ్చేలోగా సాయిల్ టెస్టింగ్, డిజైన్లు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టు విషయంపై కేసీఆర్ హయాంలో చేసిన పొరపాటు తెలంగాణ ప్రజలకు తెలుసునని చెప్పుకొచ్చారు. బీఆర్ఎస్ హయాంలో కాళేశ్వరాన్ని నిర్మించారని, అది కూలిపోయిందని అన్నారు. కాళేశ్వరంపై దాదాపు రూ.97 వేల కోట్ల ప్రజాధనాన్ని ఖర్చు చేసి ఆ ప్రాజెక్టు నిర్మించారని తెలిపారు. కాళేశ్వరంపై ప్రతి ఏడాది రూ.10వేల కోట్ల వడ్డీ కడుతున్నామని తెలిపారు. ప్రజాధనం ఉపయోగించడంతోనే దాన్ని ఎలా రిపేర్ చేయాలో ఆలోచించి ముందుకు వెళ్తున్నామని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రజలు అన్నీ విషయాలు గమనిస్తున్నారని అన్నారు. నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ మార్గదర్శకాలకు అనుగుణంగా ముందుకు వెళ్తున్నామని చెప్పుకొచ్చారు. మేడిగడ్డ డ్యామేజ్ సాయిల్ టెస్ట్, డిజైన్ల ఖర్చులను కాంట్రాక్ట్ సంస్థలే భరిస్తాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు.

# మరింత పెరిగిన బంగారం ధర

**హైదరాబాద్,ఏప్రిల్17 :** భారత్‌లో బంగారం ధరలు గత మూడు రోజులుగా ఎంతో కొంత పెరుగుతూనే ఉన్నాయి. అంతర్జాతీయ అనిశ్చితులు తగ్గుతాయన్న సంకేతాలతో పాటు అక్షయ తృతీయ సమీపిస్తున్న తరుణంలో పసిడికి డిమాండ్ అంతకంతకూ పెరుగుతోంది. గత మూడు రోజుల్లో పసిడి ధరలు సుమారు రూ.3 వేల మేర పెరిగాయి. గుడ్ రిటర్న్స్ వెబ్‌సైట్ కథనం ప్రకారం, ఉదయం 6.30 గంటల సమయంలో హైదరాబాద్ బులియన్ మార్కెట్‌లో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,55,580గా ఉంది. 22 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,42,610గా ఉంది. వెండి ధర దాదాపుగా స్థిరంగానే ఉంది.

ప్రస్తుతం కిలో వెండి ధర రూ.2,74,900ల వద్ద కొనసాగుతోంది. చెన్నైలో 24 క్యారెట్ల 10 గ్రాముల పసిడి ధర రూ.1,56,670గా ఉంది. ముంబైలో రూ.1,55,580 వద్ద, న్యూఢిల్లీలో రూ.1,55,730 వద్ద కదలాడుతోంది. 22 క్యారెట్ల 10 గ్రాముల ఆర్నమెంటల్ పసిడి ధర చెన్నైలో రూ.1,43,610గా, ముంబైలో రూ.1,42,610గా, న్యూఢిల్లీలో రూ.1,42,760గా ఉంది. దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో వెండి ధరలు రూ.2.69 లక్షల నుంచి రూ.2.74 లక్షల వరకూ ఉన్నాయి. ఇక అంతర్జాతీయ మార్కెట్‌లో ప్రస్తుతం ఔన్స్ (31.10 గ్రాములు) 24 క్యారెట్ల పసిడి ధర 4,787 డాలర్ల వద్ద, ఔన్స్ వెండి ధర 78 డాలర్ల వద్ద కొనసాగుతోంది.

# తేజస్వీ వ్యాఖ్యలను తొలగించేలా చేయండి

**కిషన్ రెడ్డిని కోరిన మంత్రి పొన్నం**

**లోక్‌సభలో మాట్లాడిన వ్యాఖ్యలపై చర్యలు తీసుకోలేం**

**మంత్రి పొన్నం లేఖపై డిజిపి శివధర్ రెడ్డి స్పష్టీకరణ**

**హైదరాబాద్,ఏప్రిల్17 :** తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును అవమానించే విధంగా భాజపా ఎంపీ తేజస్వీ సూర్య పార్లమెంట్‌లో మాట్లాడారని మంత్రి పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు. తెలంగాణ ఏర్పాటును భారత్–పాకిస్థాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. తేజస్వీ వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. ఇందుకు లోక్‌సభ స్పీకర్‌ను ఒప్పించాలని ఆయన కోరారు. ఎంపీ విషయంలో చర్యలు తీసుకోవాలంటూ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డికి మంత్రి లేఖ రాశారు. ఈ లేఖపై డీజీపీ స్పందించారు. చట్టసభల్లో మాట్లాడిన అంశాలపై చర్యలు తీసుకునే అధికారం పోలీసులకు ఉండదని డీజీపీ శివధర్ రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలపై మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా తేజస్వి మాట్లాడుతుంటే బీజేపీ ఎంపీలు, కేంద్ర మంత్రులు మౌనంగా ఉన్నారని మంత్రి మండిపడ్డారు. తెలంగాణ ఏర్పాటును భారత్–పాకిస్తాన్ విభజనతో పోల్చడం సరికాదన్నారు. ఎంపీపై చర్యలు తీసుకోవాలని డీజీపీ శివధర్‌రెడ్డిని మంత్రి పొన్నం ప్రభాకర్ కోరారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో డీలిమిటేషన్‌పై చర్చలో ఎంపీ తేజస్వి సూర్య పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర విభజనను ప్రస్తావిస్తూ.. బ్రిటీష్ వాళ్లు చేసిన భారత్– పాకిస్తాన్ విభజనకంటే దారుణంగా ఆంధ్రప్రదేశ్ నుంచి తెలంగాణను వేరే చేశారంటూ ఎంపీ వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపాయి.

## పేరు, ఫోటో వాడకుండా చూడండి

**ఢిల్లీ కోర్టులో అల్లు అర్జున్ కేసు**

**న్యూఢిల్లీ,ఏప్రిల్17 :** ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. అనుమతి లేకుండా ఆయన పేరు, ఫొటో, వాయిస్‌లను ఎవరూ వాడకూడదని కోరుతూ.. ఒక పిటీషన్ దాఖలు చేశారు. తన పేరు, ఫోటోలను ఉపయోగించుకుని పలు ఉత్పత్తులను విక్రయిస్తూ డబ్బు సంపాదించుకుంటూ తన ప్రతిష్ఠను దెబ్బతీసేలా చేస్తున్న వారికి ఈ కేసు వర్తిస్తుందని, తన వ్యక్తిత్వ హక్కుల పరిరక్షణ కోరుతూ ఢిల్లీ హైకోర్టులో అల్లు అర్జున్ దావా వేశారు. శుక్రవారం జస్టిస్ తుషార్ రావు కమిటీ నేతృత్వంలో ఈ కేసు విచారణకు రానుంది. ఇదే అంశంలో ఇప్పటికే చిరంజీవి , మోహన్ లాల్ , నాగార్జున, జూనియర్ ఎన్టీఆర్, పవన్ కల్యాణ్, ఐశ్వర్య రాయ్, తదితరులు తమ వ్యక్తిత్వ హక్కులను కాపాడాలంటూ కోర్టును కోరిన సంగతి విదితమే. ఈ కేసులలో సినీ ప్రముఖుల ప్రైవసీ హక్కులను రక్షించకపోతే వారికి సరిదిద్దలేని నష్టం జరుగుతుందని న్యాయస్థానం స్పష్టం చేస్తూ తీర్పు ఇచ్చింది.

# జాతీయ విపత్తును నివారించిన రోజు

మొదటి పేజీ తరువాయి

ఎక్స్ వేదికగా స్పందించారు. విపక్ష నేతలందరూ ఏకమై ఒక 'జాతీయ విపత్తును' నివారించారని సీఎం ఈ సందర్భంగా పేర్కొన్నారు. ముఖ్యమంత్రి తన సందేశంలో ప్రధానంగా మూడు అంశాలను ప్రస్తావించారు. భారత దేశ ప్రజాస్వామ్య చరిత్రలో ఇది చిరస్థాయిగా నిలిచిపోయే ఒక మరపురాని రోజని సీఎం అభివర్ణించారు. లోక్‌సభ విపక్ష నేత రాహుల్ గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే నాయకత్వంలో ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి రావడంపై రేవంత్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్య శక్తుల ఐక్యతే ఈ విజయాన్ని సాధించిందని తెలిపారు. ఈ బిల్లులను 'నల్ల బిల్లులు'గా పేర్కొంటూ.. వీటిని ఓడించేందుకు కఠిన పరిస్థితుల్లోనూ సాహసంతో నిలబడినందుకు విపక్ష కూటమిలోని మిత్రపక్షాల నాయకులకు సీఎం రేవంత్ రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఈ పోరాటంలో అండగా నిలిచిన దేశంలోని ప్రముఖ రాజకీయ నాయకులందరినీ సీఎం రేవంత్ రెడ్డి పేరుపేరునా ప్రస్తావించారు. వీరిలో ఎం.కే. స్టాలిన్ తమిళనాడు, మమతా బెనర్జీ పశ్చిమ బెంగాల్, అఖిలేశ్ యాదవ్, ఉత్తర్ ప్రదేశ్ శరద్ పవార్, ఉద్ధవ్ ఠాక్రే (మహారాష్ట్ర), లాలు ప్రసాద్ యాదవ్ బిహార్ ,హేమంత్ సోరెన్ జార్ఖండ్, అరవింద్ కేజ్రీవాల్ ఢిల్లీ వీరితో పాటు ఫరూఖ్ అబ్దుల్లా, నవీన్ పట్నాయక్, కమ్యూనిస్ట్ పార్టీల నాయకులకు కూడా ఆయన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ



ప్రకటన జాతీయ రాజకీయాల్లో తెలంగాణ పోషిస్తున్న క్రియాశీలక పాత్రను స్పష్టం చేస్తోంది. ఈ బిల్లు వీగిపోవడం కేంద్ర ప్రభుత్వానికి గట్టి ఎదురుదెబ్బగా విపక్షాలు భావిస్తున్నాయి. దక్షిణాది నుంచి రేవంత్ రెడ్డి జాతీయ స్థాయి మిత్రపక్షల నేతలతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగడం ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతిపక్షాలన్నీ ఏకమవ్వడం శుభ పరిణామమని సీఎం అభిప్రాయపడ్డారు. ఇదిలావుంటే భారత మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతి సందర్భంగా.. ఢిల్లీలోని అధికారిక నివాసంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాధాకృష్ణన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు. రాధాకృష్ణన్ దేశానికి చేసిన సేవలను ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేసుకున్నారు. భారతదేశపు మొట్టమొదటి ఉపరాష్ట్రపతిగా సేవలందించారన్నారు. భారతదేశం గర్వించదగ్గ గొప్ప తత్వవేత్త, విద్యావేత్త అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీలు వేం నరేందర్ రెడ్డి, అనిల్ కుమార్ యాదవ్, చామల కిరణ్ కుమార్ రెడ్డి, కాంగ్రెస్ నేత రోహిన్ రెడ్డి పాల్గొన్నారు.

# 30లక్షలకు పైగా ధాన్యం సేకరణ చేపట్టండి

**కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి**

**సీఎం రేవంత్ వినతి**

**న్యూఢిల్లీ,ఏప్రిల్17 :** 2025–26 వానాకాలం, యాసంగి సీజన్లకు సంబంధించి 30 లక్షల మెట్రిక్ టన్నుల పార్ బాయిల్డ్ ధ్యానం సేకరించాలని కేంద్రమంత్రికి సిఎం రేవంత్, మంతంరి ఉత్తమ్ విజ్ఞప్తి చేశారు. అలాగే యాసంగి పంట 90 లక్షల మెట్రిక్ టన్నులు వస్తుందని కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషికి సీఎం రేవంత్ వివరించారు. ఈ ధాన్యం మొత్తం కొనుగోలు చేసి తెలంగాణ రైతాంగానికి అండగా నిలవాలని కోరారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ప్రహ్లాద్ జోషితో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి భేటీ అయ్యారు. కేంద్ర పౌరసరఫరాల శాఖ నుంచి రాష్ట్రానికి రావాల్సిన పెండింగ్ నిధులు, ఇతర అంశాలపై చర్చించారు. కేంద్ర మంత్రితో భేటీ అనంతరం మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ..'దేశంలోనే అత్యధికంగా తెలంగాణలో వరిధాన్యం ఉత్పత్తి జరుగుతోంది. ఈ రబీ సీజన్‌లో 90 లక్షల మెట్రిక్ టన్నుల వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేయబోతున్నాం. వరి ధాన్యం రైతుల నుంచి కొనుగోలు చేసిన 48 గంటల్లోనే మద్దతు ధర డబ్బులు వారి ఖాతాల్లో వేస్తున్నాం. ఈ రబీ సీజన్‌లో 30 లక్షల మెట్రిక్ టన్నుల బాయిల్డ్ రైస్ కేంద్ర ప్రభుత్వం ఎఫ్‌సీఐ ద్వారా తీసుకోవాలని కేంద్ర మంత్రికి విజ్ఞప్తి చేశాం. కేంద్రం నుంచి తెలంగాణకు రూ.1,400 కోట్లు రావాల్సి ఉంది. పదేళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఆ నిధులను విడుదల చేయాలని కోరాం. కేంద్రం పోషకాహార పంపిణీ పథకాన్ని రద్దు చేసింది. ఇది సరైన విధానం కాదు' అని తెలిపారు. ఢిల్లీలో తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి పర్యటన బిజీబిజీగా సాగుతోంది. డీలిమిటేషన్‌పై హైబ్రిడ్ మోడల్‌కు మద్దతు కూడగట్టేందుకు ఆయన ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ మేరకు దక్షిణాది రాష్ట్రాల వాదనను జాతీయస్థాయిలో వినిపించేందుకు కృషి చేస్తున్నారు. ప్రోరేటాకు వ్యతిరేకంగా దక్షిణాది ముఖ్యమంత్రులను రేవంత్ సమన్వయం చేస్తున్నారు. అదే సమయంలో పలువురు కేంద్రమంత్రులను రేవంత్ రెడ్డి కలుస్తున్నారు. తెలంగాణకు రావాల్సిన నిధులు, పథకాలపై చర్చిస్తున్నారు.

# శాస్త్రిపురం ఫ్లై ఓవర్ ప్రారంభం

**ప్రారంభించిన మంత్రి శ్రీధర్ బాబు**

**హైదరాబాద్,ఏప్రిల్17 :** హైదరాబాద్ నగర అభివృద్ధిలో కీలక అడుగుపడింది. నగరంలో మరో ఆర్‌వోబీ ప్రజలకు అందుబాటులోకి వచ్చింది. శుక్రవారం శాస్త్రిపురం రైల్వే ఓవర్ బ్రిడ్జ్‌ను మంత్రి శ్రీధర్ బాబు ప్రారంభించారు. ఈ ఫ్లై ఓవర్ నిర్మాణానికి జీహెచ్‌ఎంసీ 71 కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. సుమారు 490 మీటర్ల పొడవుతో, నాలుగు లైన్లలో ఫ్లై ఓవర్ జీహెచ్‌ఎంసీ నిర్మించింది. జీహెచ్‌ఎంసీ, సౌత్ సెంట్రల్ రైల్వేల సమన్వయంతో ఈ ప్రాజెక్టను చేపట్టారు. శాస్త్రిపురం ఫ్లై ఓవర్ అందుబాటులోకి రావడంతో మైలార్ దేవ్‌పల్లి నుంచి ఫలక్‌నుమా మార్గంలో ప్రయాణం సులభతరం అయింది. ఉద్దమ్‌గడ్డ రైల్వే లెవల్ క్రాసింగ్ వద్ద ఏర్పడే ట్రాఫిక్ జామ్‌కు చెక్ పడనుంది. ప్రయాణ సమయం కూడా చాలా వరకు తగ్గనుంది. ఈ ఓల్గ÷వర్ ద్వారా మైలార్‌దేవ్‌పల్లి, వట్టెపల్లి, ఫలక్‌నుమా, ఆర్టీసీ బస్ డిపో ప్రాంతాల మధ్య కనెక్టివిటీ మెరుగుపడింది.



# 9 ఏళ్ల బాలికను కాపాడిని ముగ్గురు

**వారిని పిలిచి సన్మానించిన కమిషనర్**

**ప్రజా చైతన్యంతోనే పోలీసింగ్ పటిష్టం**

**ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్న సజ్జనార్**

**హైదరాబాద్,ఏప్రిల్17 :** తొమ్మిదేళ్ల బాలికను కాపాడిన ముగ్గురు సామాన్య పౌరులను హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనార్ ప్రశంసించారు. చిన్నారిపై లైంగిక వేధింపులకు పాల్పడుతున్న కామాంధుడిని ప్రాణాలకు తెగించి పట్టుకున్న సెజల్, గణపతి, కాశీనాథ్‌లను సీపీ సజ్జనార్ ప్రత్యేకంగా అభినందించారు. బషీర్‌బాగ్‌లోని పాత కమిషనరేట్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో సీపీ సజ్జనార్ ఈ ముగ్గురును శాలువాలతో సన్మానించి, ప్రశంసా పత్రాలతో పాటు నగదు రివార్డును అందజేశారు. 'వీరి సాహసం సమాజానికి ఒక గొప్ప సందేశమని ప్రశంసించారు. మహిళలు, చిన్నారుల రక్షణలో పౌరులు ఇలాగే అప్రమత్తంగా ఉంటే నేరాలను అరికట్టవచ్చని వ్యాఖ్యానించారు. ప్రతి ఒక్కరూ 'ప్రజా పోలీస్'గా మారాలని సీపీ సజ్జనార్ సూచించారు. ఈ సందర్భంగా గతంలో గోల్కొండలో ఎనిమిదేళ్ల బాలికను కాపాడిన మహ్మద్ ఫిరోజ్ ఉదంతాన్ని కూడా సీపీ సజ్జనార్ గుర్తు చేశారు. ప్రజల చైతన్యమే నేర నియంత్రణలో పోలీసులకు కొండంత అండ అని అభిప్రాయపడ్డారు. సమాజంలో ఏవైనా అనుమానాస్పద ఘటనలు లేదా నేరాలు జరుగుతున్నప్పుడు భయపడకుండా ఈ మార్గాల ద్వారా పోలీసులను సంప్రదించాలని సీపీ సజ్జనార్ సూచించారు. అత్యవసర సహాయం కోసం డయల్ 100 లేదా హైదరాబాద్ పోలీస్ వాట్సాప్ నంబర్ 94906 16555లో సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఐటీ సెల్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, జూబ్లీహిల్స్ ఎస్ఐ సోమ శేఖర్ తదితరులు




పాల్గొని సాహస యువతను అభినందించారు. ఈ నెల 14వ తేదీన సెజల్ తన స్నేహితుడు గణపతితో కలిసి యూసుఫ్‌గూడ నుంచి మాదాపూర్ వైపు బైక్‌పై వెళుతుండగా, జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ – 10 సమీపంలో ఓ హృదయ విదారక దృశ్యాన్ని గమనించారు. ఓ వ్యక్తి చిన్నారితో అత్యంత అసభ్యకరంగా ప్రవర్తిస్తున్నాడు. ఆ బాలిక కళ్లలో కనిపించిన భయం సెజల్, గణపతిలను కదిలించింది. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వారు నిందితుడిని అడ్డుకున్నారు. అదే సమయంలో అటుగా వెళ్తున్న కాశీనాథ్, నారాయణలు కూడా తోడవడంతో నిందితుడు తప్పించుకోలేకపోయాడు. వెంటనే డయల్ 100కు కాల్ చేసి నిందితుడిని పోలీసులకు అప్పగించారు. పోలీసుల విచారణలో నిందితుడు యూసఫ్‌గూడకు చెందిన జావీద్ అని గుర్తించారు. బాలిక తల్లిదండ్రులు కూలీ పనులకు వెళ్లిన సమయాన్ని ఆసరాగా చేసుకున్న నిందితుడు, ఐస్‌క్రీమ్ కొనిస్తానని ఆ చిన్నారిని బైక్‌పై తీసుకెళ్లాడు. నిర్మానుష్య ప్రదేశానికి తీసుకెళ్లి లైంగిక వేధింపులకు గురిచేశాడు. నిందితుడిపై జూబ్లీహిల్స్ పోలీసులు పోక్సో యాక్ట్ కింద కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మానేరు **జనత**
తెలుగు దినపత్రిక | ఇది జనం గొంతుక



# సిగాచీ బాధితులను నట్టేట ముంచారు

**కోటి పరిహారం హామీ ఇచ్చి మరచిన సీఎం**

**మరోమారు మండిపడ్డ హరీష్ రావు**



**హైదరాబాద్,ఏప్రిల్17 :** సిగాచి ప్రమాద బాధితులకు ఇచ్చిన హామీని కూడా నిలుపుకోలేక తన అసమర్థతను సీఎం రేవంత్ రెడ్డి మరోసారి చాటుకున్నారని బీఆర్ఎస్ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్‌రావు విమర్శించారు. నాడు కోటి రూపాయల సాయం అంటూ సిగాచి బాధితులను నమ్మబలికి అందులో సగం కూడా వారికి చేర్చని రేవంత్ రెడ్డి నయవంచనలో తనను మించినవారు లేరని నిరూపించుకున్నారని అన్నారు. ఆ పూటకు మాటలు చెప్పడం.. ఆ తర్వాత తాను చెప్పిన మాటలకే విలువ ఇవ్వకపోవడం రేవంత్ రెడ్డికే చెల్లిందని విమర్శించారు. సిగాచి పరిశ్రమ అగ్నిప్రమాదంలో 54 మంది అమాయక కార్మికులు ప్రాణాలు కోల్పోతే, ఆ బాధితుల కుటుంబాలను ఆదుకోవడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం అయ్యిందని అన్నారు. ప్రమాదం జరిగిన వెంటనే సంఘటనా స్థలానికి వెళ్లిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రులు వివేక్, దామోదర రాజనర్సింహ.. మృతదేహాల సాక్షిగా ఒక్కో కుటుంబానికి కోటి రూపాయల పరిహారం ఇస్తామని ఆర్భాటంగా ప్రకటించారని తెలిపారు. కానీ ఇదంతా కంటితుడుపు చర్యే అని, బాధితులకు జరిగిన న్యాయం శూన్యమని ప్రభుత్వం అసెంబ్లీలో ఇచ్చిన లిఖితపూర్వక సమాధానంతో తేటతెల్లమైందని పేర్కొన్నారు. యాజమాన్యం, ప్రభుత్వం కుమ్మక్కై పరిహారం లెక్కల్లో చేస్తున్న మోసం అంతా ఇంతా కాదని హరీశ్‌రావు అన్నారు. ప్రభుత్వం అసెంబ్లీలో సమర్పించిన అధికారిక లెక్కల ప్రకారం, 54 మంది బాధితులకు కలిపి ఇప్పటివరకు చెల్లించిన రూ. 24.51 కోట్లను విభజించి చూస్తే, ఒక్కో కార్మికుడి కుటుంబానికి సగటున అందిన పరిహారం కేవలం రూ. 45.40 లక్షలు మాత్రమే అని తెలిపారు. అంటే ముఖ్యమంత్రి హామీ ఇచ్చిన కోటి రూపాయల పరిహారంలో ఇంకా ఒక్కో కుటుంబానికి దాదాపు రూ. 54.60 లక్షల చొప్పున, మొత్తంగా రూ. 29.48 కోట్ల బకాయిని ఈ ప్రభుత్వం ఎగ్గొట్టి బాధితులను నట్టేట ముంచిందని మండిపడ్డారు. దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ పేద బాధిత కుటుంబాలను గాలికి వదిలేశారని మండిపడ్డారు. ఇక్కడ మరో మోసం దాగుందని విమర్శించారు. యాజమాన్యం తాము 40 నుంచి 42 లక్షలు ఇస్తున్నామని కోర్టుల ముందు ఒప్పుకుందని చెప్పారు. అసలు నిజమేంటంటే, వారు సొంతంగా ఇచ్చిన 25 లక్షలకు.. కార్మికులు చనిపోవడం వల్ల చట్టబద్ధంగా వారికి రావాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ, లైఫ్ ఇన్సూరెన్స్ డబ్బులను కూడా కలుపుకుని ఈ లెక్కలు చూపిస్తున్నారని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం, యాజమాన్య అమానవీయతకు, దిగజారుడుతనానికి పరాకాష్ట అని మండిపడ్డారు. అంతేకాదు, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ చనిపోయిన కార్మికుల వైద్య ఖర్చులను కూడా ఈ అరకొర పరిహారంలోనే కోత విధించడం దారుణమని అన్నారు. ఇక ప్రమాదంలో కాలి బూడిదై ఆచూకీ దొరకని 8 మంది కార్మికుల కుటుంబాలను డెత్ సర్టిఫికెట్ల కోసం నెలల తరబడి ఆఫీసుల చుట్టూ తిప్పించుకున్న దుర్మార్గ ప్రభుత్వం ఇది అని విమర్శించారు. ఇది కేవలం ఒక ప్రమాదం కాదు, యాజమాన్యం నిర్లక్ష్యంతో జరిగిన సామూహిక హత్య అని హరీశ్‌రావు అన్నారు. ఫ్యాక్టరీలో భద్రతా ప్రమాణాలు గాలికొదిలేశారని విచారణలో ఆధారాలతో సహా స్పష్టంగా తేలిందని చెప్పారు. బాధితుల పక్షాన హైకోర్టులో కేసు వేసి, న్యాయస్థానం మొట్టికాయలు వేస్తే తప్ప పోలీసులు కదలలేదని హరీశ్‌రావు తెలిపారు. తూతూ మంత్రంగా ఎండీని అరెస్టు చేయడం, వెంటనే ఆయన బెయిల్ మీద బయటకు వచ్చేలా పరోక్షంగా సహకరించడం చూస్తుంటే.. ప్రభుత్వానికి, కంపెనీ యాజమాన్యానికి మధ్య ఉన్న లోపాయికారీ ఒప్పందాలు ఏమిటో అర్థం అవుతూనే ఉందన్నారు.

ఆనాడు మృతదేహాల సాక్షిగా ఇచ్చిన మాట ప్రకారం, పీఎఫ్, ఈఎస్ఐ డబ్బులతో సంబంధం లేకుండా ప్రతి బాధిత కుటుంబానికి కోటి రూపాయల పరిహారం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

# పదేళ్లు అధికారంలో ప్రజలను ఎందుకు కలవలేదు

**ఇప్పుడే పాదయాత్ర చేయాలని ఎందుకనో**

**కెటిఆర్‌పై విమర్శలు గుప్పించిన కవిత**

**ప్రజాసమస్యలు పరిష్కరించే వరకు ప్రభుత్వాన్ని నిదీస్తాం**

**జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత**




**హైదరాబాద్,ఏప్రిల్17 :** పదేళ్లు బీఆర్ఎస్ అధికారంలో ఉందని.. పాదయాత్ర చేస్తానని మాజీ మంత్రి కేటీఆర్ (ఐ÷ఖీ) ఇప్పుడు ఎందుకు అంటున్నారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రశ్నించారు. పదేళ్లు అధికారంలో ఉండి ఆయన ఎందుకు ప్రజల్లోకి పోలేదని నిలదీశారు. ప్రజా సమస్యలను పరిష్కరించేది అధికార పార్టీనేనని.. అందుకే కాంగ్రెస్‌ను టార్గెట్ చేశానని కవిత తెలిపారు. ఆయా సమస్యల ఆధారంగా బీఆర్ఎస్‌పైన కూడా మాట్లాడుతానని అన్నారు. పరిగిలో రైతు దీక్షకు మద్దతు ఇచ్చేందుకు వెళ్తున్నానని చెప్పి.. హరీశ్‌రావు హౌస్ అరెస్ట్ అయ్యారని తెలిపారు. ఆ సమయంలో హరీశ్‌రావు ఫోన్ చేస్తే పోలీసులు ఆయన ఇంటికి వచ్చి హౌస్ అరెస్ట్ చేశారని విమర్శించారు. హరీశ్‌రావు పరిగిదాకా కూడా పోలేదని ఎద్దేవా చేశారు. తాము పరిగి వెళ్లి రైతులకు మద్దతుగా దీక్షలో పాల్గొన్నామని స్పష్టం చేశారు. పోలీసులు తమను అరెస్టు చేశారని.. రైతులకు మద్దతుగా తాము నిలిచామని తెలిపారు. ఖమ్మం జిల్లా వెలుగుమట్లలో ఏ విధంగానైతే పోరాటం చేశామో...అదే విధంగా పరిగిలో కూడా పోరాటం చేశానని వెల్లడించారు. భవిష్యత్తులో కూడా పోరాటం చేస్తానని కవిత పేర్కొన్నారు. తెలంగాణలో అన్నివర్గాలకు అధికారం రావాలన్నదే తన ధ్యేయమని వ్యాఖ్యానించారు. అందరికీ అధికారమని మాట్లాడుతారని.. దీనిని ఆచరణలోకి తీసుకురావాలని తాను ప్రారంభించాకే తనకు కష్టాలు వచ్చాయని పేర్కొన్నారు. తెలంగాణ జాగృతి పెట్టబోయే పార్టీకి మారోజు వీరన్న అనుచరులు, సీపీయూఎస్ఐ, దళిత బహుజన రాజ్యాధికార సంస్థ మద్దతు ఇచ్చారని తెలిపారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో కవితను పలువురు కలిశారు. ఆమెను కలిసిన వారిలో సీపీయూఎస్ఐ కేంద్ర కమిటీ కార్యదర్శి కోదండం, రాష్ట్ర కార్యదర్శి వెంకన్న, దళిత బహుజన రాజ్యాధికార కన్వీనర్ గుడిపల్లి రవన్న, మారోజు వీరన్న సహచరులు కిషన్ నాయక్ సహా పలువురు నాయకులు ఉన్నారు. ఈసమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడారు. ప్రతి కష్టాన్ని పాఠంగా భావిస్తూ.. సామాజిక తెలంగాణ సాధించే వరకు పోరాటం చేస్తానని కవిత స్పష్టం చేశారు. సర్వోదయ తెలంగాణ తన లక్ష్యమని.. అందరి జీవితాల్లో వెలుగులు నిండాలని ఆకాంక్షించారు. మారోజు వీరన్న అనుచరుల మద్దతు ఎంతో శక్తిని ఇస్తుందని అన్నారు. తమతో మారోజు వీరన్న అనుచరులు కలవటమంటే ఇక తమను ఆపే శక్తే లేదని పేర్కొన్నారు. ఏదైనా శని ఉంటే.. అది తొలగిపోవడం కోసమే తాను వారణాసి వెళ్లి పూజలు చేశానని ప్రస్తావించారు. తాను పెట్టే పార్టీ సక్సెస్ కావాలని కోరుకున్నానని తెలిపారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు మాజీ ఎమ్మెల్యేలు తనను కలిశారని.. పేర్లు మాత్రం తాను బయటకు చెప్పనని అన్నారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్‌ను ముందుగా టార్గెట్ చేశానని తెలిపారు. తనను ఆ పార్టీ సస్పెండ్ చేసిందని కవిత ప్రస్తావించారు.

## తమిళనాడులో ఘోర రోడ్డు ప్రమాదం

**లోయలో పడ్డ వ్యాన్: పదిమంది దుర్మరణం**

**చెన్నై,ఏప్రిల్17 :** తమిళనాడులో ఘోర ప్రమాదం చోటుచేసుకుంది. వ్యాన్ లోయలో పడ్డ ఘటనలో 10 మంది చనిపోగా.. మరి కొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. కోయంబత్తూరు జిల్లాలోని వాల్పరై ఘాట్ రోడ్డులో ఈ విషాదకర ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం కొండ ప్రాంతంలో ప్రయాణిస్తున్న ఓ వ్యాన్ అదుపుతప్పింది. వేగంగా వెళ్లి లోయలో పడిపోయింది. పైనుంచి కిందపడ్డంతో వ్యాన్ నుజ్జునుజ్జయింది. వ్యానులో ఉన్న పది మంది అక్కడికక్కడే చనిపోయారు. మరికొంతమంది తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, రెస్క్యూ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకున్నారు. గాయపడ్డ వారిని హుటాహుటిన ఆస్పత్రికి తీసుకెళ్లారు. పోలీసులు 10 మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఈ సంఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. కర్ణాటకలోని యాదగిరి జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. హైవేపై వేగంగా దూసుకు వెళుతున్న కారు టైర్ పేలింది. ఒక్కసారిగా అదుపుతప్పిన కారు.. వేగంగా వెళ్లి బస్సును ఢీకొట్టింది. దీంతో బస్సులో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ఆ మంటలు వేగంగా కారుకు వ్యాపించాయి. కారు, బస్సు మంటల్లో దగ్ధం అయ్యాయి. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న ఆరు మంది కాలి బూడిదయ్యారు. బస్సులో ఉన్న ఇద్దరు ప్రయాణికులకు స్వల్పగాయాలు అయ్యాయి.

## కాళేశ్వరం ప్రాజెక్ట్ పునరుద్ధరణ

**బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు**

హైదరాబాద్,ఏప్రిల్17 : కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్‌పై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మేడిగడ్డ, సుందిళ్ల, అన్నారం బ్యారేజీల పునరుద్ధరణకు కమిటీ ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు అనీ. పరిచిత్ మెహ్రా ఆధ్వర్యంలో కమిటీ ఏర్పాటు చేసింది. ఇంజినీర్లు, నిపుణులతో ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసింది. మూడు బ్యారేజీల మరమ్మతులకు సమన్వయ కమిటీ ఏర్పాటు చేసింది. కాళేశ్వరం ప్రాజెక్ట్ రిపేర్ పనులు వేగవంతం చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. రుతుపవనాలకు ముందే జియో టెక్నికల్ పరిశీలనలు పూర్తి చేయాలని తెలంగాణ సర్కార్ సూచించింది. మే 30వ తేదీలోగా పరిశీలనలు పూర్తిచేయాలని డెడ్‌లైన్ విధించింది. రోజువారీ పురోగతి నివేదికలు సమర్పించాలని ఆదేశాలు జారీ చేసింది. ప్రతిరోజూ సాయంత్రం 5 గంటలకు రిపోర్ట్ ఇవ్వాలని ఆదేశించింది. సీడబ్ల్యూసీ ఎన్డీఎస్ఏ అనుమతులతో పనులు, డిజైనింగ్ పునరుద్ధరణ పనులకు ప్రాధాన్యం ఇవ్వాలని నిర్ణయించింది. రోజువారీ యాక్షన్ ప్లాన్‌తో పనులు చేపట్టాలని తెలంగాణ ప్రభుత్వం సంబంధిత అధికారులను ఆదేశించింది.

# భారత్ అంతర్గత వ్యవహారాల్లో జోక్యం తగదు

**పాక్‌ను హెచ్చరించిన విదేశాంగ శాఖ**

**న్యూఢిల్లీ,ఏప్రిల్17 :** భారత అంతర్గత వ్యవహారాల్లో బయటివారు జోక్యం చేసుకోవద్దని విదేశాంగ మంత్రిత్వ శాఖ పాకిస్థాన్‌ను హెచ్చరించింది. డీలిమిటేషన్ బిల్లుపై పాకిస్థాన్ చేసిన వ్యాఖ్యలను తోసిపుచ్చింది. దేశానికి సంబంధించిన అంతర్గత విషయాల్లో చొరబడేందుకు చేసే యత్నాలను భారత్ ఎన్నటికీ సహించబోదని విదేశాంగ మంత్రిత్వ శాఖ అధికార ప్రతినిధి రణధీర్ జయస్వాల్ పేర్కొన్నారు. దేశంలోని పరిపాలనా, శాసనపరమైన ప్రక్రియలకు సంబంధించిన నిర్ణయాలు సార్వభౌమత్వానికి సంబంధించిన విషయాలని.. వీటిలో ఇతర దేశాల జోక్యాన్ని సహించబోమన్నారు. పాకిస్థాన్ ఆక్రమిత కశ్మీర్(పీవోకే)లో నియోజకవర్గాల పునర్విభజన చేపట్టేందుకు ఎన్నికల సంఘానికి అధికారం కల్పించే ఒక నిబంధన డీలిమిటేషన్ బిల్లు 2026లో ఉంది. ఈ నిబంధనపై పాకిస్థాన్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. భారత్ ప్రవేశపెట్టిన ఈ డీలిమిటేషన్ బిల్లును వ్యతిరేకిస్తున్నట్లు పాక్ విదేశాంగ మంత్రిత్వ శాఖ ప్రతినిధి తాహిర్ అంద్రాబీ పేర్కొన్నారు.

# ఉత్తరాది, దక్షిణాది పేరుతో విషం చిమ్ముతున్నారు

**రేవంత్‌ది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా**

**కాంగ్రెస్, బీఆర్ఎస్‌ల తీరుపై మండిపడ్డ కిషన్ రెడ్డి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్17 :** దక్షిణాది రాష్ట్రాల్లో సీట్లు తగ్గకుండా డీలిమిటేషన్ ప్రక్రియ జరుగుతోందని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. కొత్త నాయకత్వానికి అవకాశం వస్తుందని ప్రతిపక్షాలు డీలిమిటేషన్‌ను వ్యతిరేకిస్తున్నాయని మండిపడ్డారు. ఢిల్లీలో ఆయన మీడియాతో మాట్లాడారు. అన్ని రాష్ట్రాలకు సమానంగా సీట్ల పెంపు నిర్ణయం తీసుకుంటే.. తప్పుడు వ్యాఖ్యలు చేస్తున్నారు. డీలిమిటేషన్‌పై కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి రాష్ట్ర ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నాయని మండిపడ్డారు. మహిళల రిజర్వేషన్లకు ఎంఐఎం వ్యతిరేకం. ఈ అంశంలో కాంగ్రెస్, బీఆర్ఎస్‌లను కలిపింది ఎంఐఎం పార్టీయే. సీఎం రేవంత్‌రెడ్డిది హైబ్రిడ్ ఫార్ములా కాదు.. అది అసదుద్దీన్ ఓవైసీ ఫార్మాలా అని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. అలాగే మహిళా రిజర్వేషన్ బిల్లు సవరణ, నియోజకవర్గాల పునర్విభజన అంశాలపై ప్రతిపక్షాలు చేస్తున్న విమర్శలను కిషన్ రెడ్డి తీవ్రంగా ఖండించారు. విపక్షాలు రాజకీయ దురుద్దేశంతో, ప్రజలను తప్పుదోవ పట్టించేలా మాట్లాడుతున్నాయని ఆయన మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలును అడ్డుకోవాలనే తప్పుడు ఆలోచనతో ప్రతిపక్షాలు రాజకీయ విమర్శలు చేస్తున్నాయని కిషన్ రెడ్డి విమర్శించారు. నియోజకవర్గాల పునర్విభజన వల్ల దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరుగుతుందంటూ అపోహలు సృష్టించడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రతిపక్షాలు పార్లమెంట్ సాక్షిగా పచ్చి అబద్ధాలు ప్రచారం చేస్తున్నాయని, ప్రాంతీయ విద్వేషాలను రెచ్చగొట్టడం వారి రాజకీయ ప్రయోజనాల కోసమేనని ధ్వజమెత్తారు. దక్షిణ భారతదేశానికి న్యాయం చెయ్యడమే మోదీ ఫార్ములా. న్యాయమా, అన్యాయమా అనే దానిపై చర్చకు సిద్ధమా? అసదుద్దీన్ హైబ్రిడ్ ఫార్ములా ఇది, రేవంత్ రెడ్డి ఫార్ములా కాదు. మజ్లిస్ పార్టీ మహిళ రిజర్వేషన్లకు వ్యతిరేకం. ఈ పార్టీ కాంగ్రెస్, బీఆర్ఎస్‌ను కలిపింది. కాంగ్రెస్ ప్రభుత్వం మజ్లిస్ పార్టీకి లొంగిపోయి పనిచేస్తోంది. 360 మంది తెలంగాణ ఉద్యమకారులను అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం కాల్చి చంపింది. తెలంగాణ చివరి దశ ఉద్యమంలో 1200 మంది ఆత్మ బలిదానం చేసుకున్నారు. పార్లమెంట్లో బిల్లు పెట్టినప్పుడు కాంగ్రెస్ ఎంపీలే కారం పొట్లాలు, పెప్పర్ స్ప్రేలు కొట్టారు. తెలంగాణ విభజనపై ఎంపీ తేజస్వి సూర్య చేసిన తన వ్యాఖ్యలు తప్పు అయ్యాయని ఒప్పుకున్నారు. మహిళ రిజర్వేషన్, నియోజకవర్గాల పెంపు బిల్లును అడ్డుకునేవారు చరిత్రహీనులుగా మిగిలిపోతారు. దక్షిణాది రాష్ట్రాలకు నరేంద్ర మోదీ న్యాయం చేస్తున్నారని అన్నారు.

## తేజస్వీ సూర్య మాటల్లో తప్పేముంది

**మంత్రి పొన్నం వ్యాఖ్యలపై బండి మండిపాటు**



**న్యూఢిల్లీ,ఏప్రిల్17 :** తెలంగాణ విభజనపై బీజేపీ ఎంపీ తేజస్వి సూర్య మాటలను కాంగ్రెస్ నేతలు ఎందుకు తప్పుబడుతున్నారంటూ కేంద్ర మంత్రి బండి సంజయ్ మండిపడ్డారు. రాష్ట విభజన సమయంలో కాంగ్రెస్ తప్పిదాలతో పలువురు యువకులు ఆత్మబలిదానాలు చేసుకున్నారని ఎంపీ తేజస్వి సూర్య చెప్పారని తెలిపారు. 2009లో కాంగ్రెస్ తెలంగాణ ఏర్పాటుకు సహకరించి మళ్లీ వెన్నక్కి తగ్గారని.. దీని గురించే తేజస్వి సూర్య మాట్లాడారని అన్నారు. రేవంత్ రెడ్డి గతంలో సోనియాగాంధీని బలిదేవత అన్నారన్న విషయాన్ని గుర్తుచేశారు. తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించిన వ్యక్తి సీఎం రేవంత్ రెడ్డి అంటూ విమర్శించారు. అలాంటి రేవంత్ కుఏబినేట్‌లో ఉన్న పొన్నం తదితరులు గతాన్ని మరిచి విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. కరీంనగర్‌లో రణభేరి కార్యక్రమానికి రేవంత్ రెడ్డి తుపాకీ పట్టుకొని వెళ్లారని కేంద్ర మంత్రి తెలిపారు. 1400 మంది బలిదానాలకు హత్యలకు కారణమైన పార్టీ కాంగ్రెస్ అని ఆరోపించారు. ఒక్క ఓటు, రెండు రాష్ట్రాలు అనే నినాదానికి కట్టుబడి, రాష్ట్ర విభజనకు మద్దతు ఇచ్చింది బీజేపీ అని తెలిపారు. మహిళా రిజర్వేషన్ బిల్లును కాంగ్రెస్ కావాలని అడ్డుకుంటోందని మండిపడ్డారు. బీఆర్ఎస్ అవినీతి గురించి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు మాట్లాడటం లేదని కేంద్ర మంత్రి బండి సంజయ్ ప్రశ్నించారు.

## తేజస్వీ వ్యాఖ్యలపై బిఆర్ఎస్ సీరియస్

**ఢిల్లీలో ఫిర్యాదు చేసిన మాజీమంత్రి శ్రీనివాసగౌడ్**

**న్యూఢిల్లీ,ఏప్రిల్17 :** బీజేపీ యువ మోర్చా జాతీయ అధ్యక్షుడు, ఎంపీ తేజస్వి సూర్య పార్లమెంటులో చేసిన వివాదాస్పద వ్యాఖ్యలు ఇప్పుడు రాజకీయ దుమారం రేపుతున్నాయి. తెలంగాణ ఏర్పాటును పాకిస్థాన్ విభజనతో పోల్చారని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఈ అంశంపై ఆయన ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేసారు. లోక్‌సభ సాక్షిగా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటుపై అనుచిత వ్యాఖ్యలు చేశారనే ఆరోపణలతో తేజస్వి సూర్య చిక్కుల్లో పడ్డారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారంటూ బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆయనపై ఢిల్లీలో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఢిల్లీలోని పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్‌లో శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో ఈ ఫిర్యాదు నమోదైంది. ఈ సందర్భంగా ఆయన ఎంపీ వ్యాఖ్యలపై తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. తెలంగాణ విభజన ప్రక్రియను పాకిస్థాన్ ఏర్పాటుతో లేదా దేశ విభజనతో పోల్చడం అత్యంత హేయమని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. వందలాది మంది బలిదానాలు, దశాబ్దాల పోరాటం తర్వాత సిద్ధించిన తెలంగాణను ఇలా అవమానించడం రాష్ట్ర ప్రజల భావాలను గాయపరచడమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంటు వేదికగా ఓ బాధ్యతాయుతమైన పదవిలో ఉండి, ఓ రాష్ట్రం పట్ల ఇంతటి వివక్షతో మాట్లాడటం సరికాదని విమర్శించారు. తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని కించపరిచిన తేజస్వి సూర్యపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని శ్రీనివాస్ గౌడ్ పోలీసులను కోరారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసం ఓ చారిత్రక ఘట్టాన్ని తక్కువ చేసి చూపడం రాజ్యాంగ విరుద్ధమని వాదించారు. 'తెలంగాణ అంటే పోరాటాల గడ్డ' అని.. అలాంటి పవిత్రమైన ఉద్యమ ఫలితాన్ని పాకిస్థాన్‌తో పోల్చడం తేజస్వి సూర్య అజ్ఞానానికి పరాకాష్ట అని ధ్వజమెత్తారు. ఆయన వెంటనే తెలంగాణ సమాజానికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ ఘటనపై తెలంగాణ వ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. సామాజిక మాధ్యమాల్లో కూడా ఎంపీ వ్యాఖ్యలకు వ్యతిరేకంగా నెటిజన్లు పోస్టులు పెడుతున్నారు.

# ప్రపంచానికి ఇరాన్ శుభవార్త

**హోర్ముజ్ జలసంధి తెరిచి ఉంటుందని ప్రకటన**

**ఇరాన్ ప్రకటనతో భారీగా తగ్గిన ఆయిల్ ధరలు**

**టెహ్రాన్ :** ప్రపంచానికి ఇరాన్ శుభవార్త అందించింది. హోర్ముజ్ జలసంధిని తెరిచి ఉంచినట్లు ప్రకటించింది. ఇజ్రాయెల్, లెబనాన్‌ల మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రకటించింది. ఇరాన్ ప్రకటనతో ప్రపంచవ్యాప్తంగా క్రూడాయిల్ ధరలు అమాంతంగా పడిపోయాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ కీలక నిర్ణయం తీసుకుంది. ప్రపంచ రవాణాకు కీలకంగా మారిన హోర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పంద కాలం ముగిసేవరకూ హోర్ముజ్ పూర్తిగా తెరిచి ఉంటుందని ఎక్స్ వేదికగా వెల్లడించారు. ఇరాన్ తాజా ప్రకటనతో.. హోర్ముజ్ జలసంధిలో ఇకపై అన్ని వాణిజ్య నౌకలకు ప్రవేశం ఉంటుంది. అంతర్జాతీయ వాణిజ్య రవాణాకు కీలకమైన ఈ జలమార్గంలో వాణిజ్య నౌకల ప్రయాణాలకు మార్గం సుగమమైంది. ఇరాన్, ఇతర దేశాల మధ్య వాణిజ్య సంబంధాలపై ప్రభావం చూపే ఈ జలమార్గంపై.. కొన్ని నెలలుగా వివాదాలు కొనసాగుతున్నప్పటికీ, కాల్పుల విరమణ సమయం ముగిసేవరకు.. యథావిధిగా వాణిజ్య రవాణా కొనసాగించవచ్చని ఇరాన్ స్పష్టం చేసింది. కాగా.. హోర్ముజ్ జలసంధి ద్వారా రోజుకు సుమారు 20 శాతం ప్రపంచ క్రూడాయిల్ సరఫరా అవుతుందన్న విషయం తెలిసిందే. కాల్పుల విరమణ ఒప్పందం అమల్లో ఉన్నంత వరకు హర్ముజ్ జలసంధి తెరిచే ఉంటుందని పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. ఇజ్రాయెల్-లెబనాన్ మధ్య 10 రోజుల కాల్పుల విరమణ ఒప్పందం కుదిరిన సంగతి తెలిసిందే. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గురువారం ఈ విషయాన్ని స్వయంగా ప్రకటించారు. అమెరికా-ఇరాన్ మధ్య శాశ్వత శాంతి ఒప్పందం కుదిరేందుకు లెబనాన్-ఇజ్రాయెల్ కాల్పుల విరమణ అంగీకారం అంశం దోహదపడే అవకాశాలు ఉన్నాయి. మరోవైపు హర్ముజ్ జలసంధిని పూర్తిగా తెరుస్తున్నట్లు ఇరాన్ ప్రకటించిందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ కూడా తన ట్రూత్ సోషల్ ఖాతాలో పేర్కొన్నారు. దీంతో పూర్తిస్థాయిలో నౌకల రాకపోకలు కొనసాగను న్నాయని తెలిపారు. ఇరాన్ ప్రకటనతో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు ఒక్కసారిగా పతనం అయ్యాయి. బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 8 శాతం మేర క్షీణించి 90 డాలర్లకు చేరింది. డబ్ల్యూటీఐ మే నెల కాంట్రాక్ట్ 9.8 శాతం క్షీణించి బ్యారెల్ ధర 85 డాలర్లకు చేరువైంది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇటీవల కాలంలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 100 డాలర్ల పైనే ట్రేడవుతూ వచ్చింది. క్రూడాయిల్ తగ్గుముఖం పట్టడం వల్ల దిగుమతులపై ఆధారపడే భారత్ వంటి దేశాలకు మేలు చేకూరుతుంది.

# యుద్ధానికి అతిత్వరలో ముగింపు

**సంధి కుదిరే వీలుంటే ఇస్లామాబాద్ వెళ్తాను : మీడియాతో ట్రంప్**

**వాషింగ్టన్ :** ఇరాన్తో యుద్ధాన్ని ముగించే ఒప్పందం త్వరలో కుదరవచ్చని, అయితే దాని సమయం ఇంకా స్పష్టం కాలేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అన్నారు. మరోవైపు కీలకమైన హోర్ముజ్ జలసంధి నౌకామార్గాన్ని తిరిగి తెరవడానికి బ్రిటన్, ఫ్రాన్‌ఆధ్వర్యంలో 40 దేశాలు సమావేశమయ్యాయి. వచ్చేవారం ముగిసే రెండు వారాల కాల్పుల విరమణను పొడిగించవచ్చని, అయితే టెహ్రాన్ ఒప్పందం కోరుకుంటున్నందున దాని అవసరం ఉంటుందని తాను భావించడం లేదని ట్రంప్ అన్నారు. ఏం జరుగుతుందో చూద్దాం. కానీ ఇరాన్తో ఒప్పందం కుదుర్చుకోవడానికి మనం చాలా దగ్గరగా ఉన్నామని నేను అనుకుంటున్నాను అని ట్రంప్ మీడియాతో అన్నారు. ఒకవేళ ఒప్పందం కుదిరి, పాకిస్తాన్ రాజధాని ఇస్లామాబాద్ లో సంతకాలు జరిగితే ఆ కార్యక్రమా నికి తాను అక్కడికి వెళ్లవచ్చని కూడా ఆయన తెలిపారు. యితే ప్రాథమిక ఒప్పందానికి రావడానికి ముందు సమస్యలు పరిష్కరించవలసి ఉందని ఇరాన్ వర్గాలు తెలిపాయి. గత వారాంతంలో చర్చలు జరిగిన ఇస్లామాబాద్ లో శుక్రవారం సైనికులు కనిపించారు. కానీ రోడ్లు తెరిచే ఉన్నాయి. అయితే గత సమావేశానికి ముందుగా చేసినట్లు వ్యాపార కార్యకలా పాలను నిలిపివేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయలేదు.

**నౌకాయాన స్వేచ్ఛను పునరుద్ధరించడం**

హోర్ముజ్ జలసంధిలో నౌకాయాన స్వేచ్ఛను పునరుద్ధరిం చడంలో సహాయపడటానికి సిద్ధంగా ఉన్నామని, అయితే ఇది కేవలం యుద్ధం ముగిసిన తరువాత మాత్రమేనని అమెరికా కు సంకేతం ఇవ్వడమే లక్ష్యంగా ఫ్రాన్స్, బ్రిటన్ అధ్యక్షతన 40 దేశాలు సమావేశమవుతున్నాయి. ఆహ్వానించబడిన దేశాలకు పంపిన నోట్ ప్రకారం హోర్ముజ్ జలమార్గం గుండా నౌకా యానం నిరాటంకంగా సాగేవిధంగా స్వేచ్ఛ ఇవ్వడానికి పూర్తి దౌత్యపరమైన మద్దతును పునరుద్ఘాటించడం, అంతర్జాతీయ చట్టాన్ని గౌరవించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పడమే ఈ సమావేశం యొక్క లక్ష్యం. ఇరాన్ తన నౌకలు మినహా ఇతర దేశాల నౌకలు రాకపోకలు సాగించకుండా హోర్ముజ్ జలసంధి ని చాలా వరకు మూసివేసంది. అదే సమయంలో అమెరికా ఈ వారం ఇరాన్ ఓడరేవులలో ప్రవేశించే లేదా బయలు దేరే నౌకలపై దిగ్బంధనాన్ని విధించింది. అమెరికా, ఇరాన్ల మధ్య మధ్యవర్తిత్వం వహిస్తున్న పాకిస్తాన్ వర్గాలు శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ, తెర వెనుక దౌత్యంలో పురోగతి ఉందని, ఇరుపక్షాల మధ్య జరగ బోయే సమావేశం ఒక అవగాహన ఒప్పందంపై సంతకాలకు దారితీయవచ్చని. దాని తరువాత 60 రోజుల్లోగా ఒక సమగ్ర ఒప్పందం కుదరవచ్చని తెలిపాయి. ఇరుపక్షాలు సూత్రప్రా యంగా అంగీకరిస్తున్నాయి. సాంకేతిక అంశాలు తరువాత చర్చకు వస్తాయని పేర్కొన్నాయి.

**యురేనియంపై రాజీకుదిరే అవకాశాలు**

ఇరాన్ అణు కార్యక్రమంపైనే ప్రధాన ప్రతిష్టంభన నెలకొంది. గత వారాంతంలో జరిగిన చర్చల్లో అమెరికా, ఇరా న్ అణు కార్యకలాపాలన్నింటిని 20 ఏళ్ల పాటు నిలిపివేయా లని ప్రతిపాదించింది. ఇరాన్ మాత్రమం మూడు నుంచి ఐదు సంవత్సరాల పాటు నిలిపివేస్తామని తెలిపింది.

# బిల్లుకు బ్రేక్

**వీగిన మహిళా రిజర్వేషన్ బిల్లు**

**131వ రాజ్యాంగ సవరణ బిల్లుకు దక్కని ఆమోదం**

**అనుకూలంగా 278.. వ్యతిరేకంగా 211 ఓట్లు**

**రాజ్యాంగ సవరణకు అవసరమైన మద్దతు కరవు**

**ఐక్యతను చాటుకున్న విపక్ష ఇండి కూటమి**

**ప్రధాని మోడీ పిలుపు నిష్ఫలం**

**న్యూఢిల్లీ,ఏప్రిల్17 :** మహిళా రిజర్వేషన్‌కు సంబంధించి రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. కేంద్రం ప్రతిష్ఠాత్మకంగా తీసుకొచ్చిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయింది. లోక్‌సభలో సుదర్ఘ చర్చ అనంతరం బిల్లుపై జరిగిన ఓటింగ్‌లో మొడొంతుల మెజార్టీని సాధించలేకపోయింది. ఈ బిల్లుతో ముడిపడిన మూడు బిల్లులపై సుదీర్ఘ చర్చ అనంతరం శుక్రవారం సాయంత్రం ఓటింగ్ జరిగింది. 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్ర పాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై ఈ ఓటింగ్ జరిగింది. ఉత్కంఠ భరితంగా జరిగిన ఓటింగ్‌లో 131వ రాజ్యాంగ సవరణ బిల్లు వీగిపోయింది. బిల్లుకు అనుకూలంగా 278, వ్యతిరేకంగా 211 ఓట్లు పడ్డాయి. మొత్తం ఓటింగ్‌లో 489 మంది పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్ అమలు సవరణ బిల్లు అవసరమైన మెజారిటీ సాధించలేక పోయింది. దీనిపై శుక్రవారం లోక్‌సభలో జరిగిన ఓటింగ్ పక్రియలో మొత్తం 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 మంది ఓటు వేయగా, వ్యతిరేకంగా 230 మంది ఓటేశారు. దీంతో మూడింట రెండొంతుల మెజారిటీ అవసరమైన 326 ఓట్లను ఎన్డీఏ సాధించలేకపోయింది. దీంతో మిగతా రెండు బిల్లులను వెనక్కి తీసుకుంటు న్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. ప్రధాని మోడీ మనస్సాక్షిగా ఓటేయాలని పిలుపునిచ్చినా విపక్ష కూటమి తన బలిమిని చాటింది. ఒక్కరు కూడా అనుకూలంగా కలసి రాలేదు. రాజ్యాంగ సవరణ బిల్లుకు మూడింట రెండొంతుల మెజారిటీ అవసరం. లోక్‌సభలో మొత్తం సభ్యుల సంఖ్య 540. అంటే బిల్లు ఆమోదం పొందాలంటే కనీసం 360 మంది మద్దతు కావాలి. అధికార ఎన్డీఏ కూటమికి 292 మంది సభ్యుల మద్దతు ఉంది. అందువల్ల మరో 68 మంది మద్దతు అవసరం. మరోవైపు విపక్షాల బలం 233. వీరు కాకుండా స్వతంత్రులు, తటస్థ పార్టీలకు చెందిన వారు కలిసి 15 మంది ఉన్నారు. ప్రతిపక్ష సభ్యులు ఎక్కువ మంది గైర్హాజరైతే బిల్లు గట్టెక్కే అవకాశం ఉందని అధికార ఎన్డీఎ భావించింది. సాయంత్రం 6 గంటలకు లోక్‌సభలో హోం మంత్రి అమిత్‌షా ప్రసంగించాక, ఈ బిల్లులపై ఓటింగ్ జరిగింది. ఓటింగ్ సమయంలో ప్రధాని మోడీ కూడా సభలోనే ఉన్నారు. ఓటింగ్ అనంతరం కిరణ్ రిజిజు ప్రకటన చేశారు. దీంతో సభను శనివారానికి వాయిదా వేస్తున్నట్లు స్పీకర్ ఓంబిర్ల ప్రకటించారు.

**విపక్షాల తీరుపై మహిళా ఎంపిల ఆందోళన**

మహిళా రిజర్వేషన్ బిల్లును అడ్డుకోవడం అత్యంత దారుణమని బీజేపీ ఎంపీ డీకే అరుణ అన్నారు. ఇదొక చీకటి రోజని, బిల్లును వ్యతిరేకించిన వారికి చీకటి రోజులు దగ్గర పడ్డట్టేనని ఆగ్రహం వ్యక్తం చేశారు. పార్లమెంట్ ప్రాంగణంలో మహిళా ఎంపిలు ఆందోళనకు దిగారు. విపక్ష పార్టీల తీరుపై మండిపడ్డారు. మహిళలకు రిజర్వేషన్లు రాకుండా అడ్డుకున్నారని మండిపడ్డారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు సంబంధించిన 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోయిన సంగతి తెలిసిందే. ఓటింగ్ పక్రియలో 528 మంది సభ్యులు పాల్గొన్నారు. బిల్లుకు అనుకూలంగా 298 ఓట్లు, వ్యతిరేకంగా 230 మంది ఓటు వేశారు. దీంతో మెజారిటీకి అవసరమైన 352 మంది సభ్యుల బలం లేకపోవడంతో బిల్లు వీగిపోయినట్లు స్పీకర్ ఓం బిర్లా ప్రకటించారు.దీంతో డీలిమిటేషన్ బిల్లు-2026, కేంద్ర పాలిత ప్రాంతాల చట్టాల (సవరణ) బిల్లు-2026ను వెనక్కి తీసుకున్నట్లు కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు ప్రకటించారు. 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్‌సభలో వీగిపోవటంపై డీకే అరుణ మాట్లాడుతూ.. 'రాష్ట్రాలకు ఎలాంటి అన్యాయం జరగదని ప్రధాని మోదీ సభా వేదికగా వివరించారు. మహిళా రిజర్వేషన్ల పట్ల ఇండియా కూటమికి చెందిన వారికి చిత్తశుద్ధి లేదు. గ్రామాల్లో కాంగ్రెస్ దాని మిత్రపక్షాల వైఖరిని ప్రజలకు వివరిస్తాం. రాజకీయ లబ్ది కోసమే మహిళలను వాడుకుంటున్నారు' అంటూ మండిపడ్డారు.

# మహిళా సాధికారత కోసమే మా ప్రయత్నం

**ఉత్తర దక్షిణ పేరుతో బిభజన సరికాదు**

**ఈ దేశంలో అన్ని ప్రాంతాల వారికి సమాన హక్కులు**

**మహిళా బిల్లును వ్యతిరేకిస్తామని చెప్పడం సరికాదు**

**మత ప్రాతిపదికన రిజర్వేషన్లు కుదరవు**

**డీలిమిటేషన్‌తో ఎస్సీ,ఎస్టీ సీట్లు పెరుగతాయి**

**వారి సీట్ల పెపును అడ్డుకోవడం సరికాదు**

**లోక్‌సభలో చర్చకు సమాధానం ఇచ్చిన అమిత్ షా**



**న్యూఢిల్లీ :** లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై రెండ్రోజులగా సుదీర్ఘ చర్చ జరిగింది. శుక్రవారం విపక్ష నేత రాహుల్ గాంధీ, తదితరులు మాట్లాడారు. సవరణ బిల్లును ఓడిస్తామని ప్రకటించారు. అనంతరం సభలో సాయంత్రం కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం ఇచ్చారు. మహిళా సాధికారత కోసమే ఈ బిల్లులను తీసుకొచ్చామని, వచ్చే ఎన్నికల్లో వీటిని అమలు చేసేలా ముందుకెళ్తున్నామన్నారు. అయితే, ఇండి కూటమి సభ్యులు దీన్ని వ్యతిరేకించారని అన్నారు. మూడు బిల్లులపై సమగ్రంగా చర్చ జరిగింది. 130 మంది ఎంపీలు తమ అభిప్రాయాలు చెప్పారు. 56 మంది మహిళా ఎంపీలు మాట్లాడారు. మహిళా బిల్లును విపక్షాలు వ్యతిరేకించాయి. ప్రస్తుత లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో భారీ వ్యత్యాసం ఉంది. ఒకచోట 39లక్షల మంది ఓటర్లు ఉంటే మరోచోట 60 వేల మంది ఓటర్లు ఉన్నారు. ఒక ఎంపీ లక్షలాది మంది సమస్యలను ఎలా ఆలకించగలరని ఈ సందర్భంగా ప్రస్తావించారు. నియోజకవర్గాల ఓటర్ల సంఖ్యలో సమతుల్యతను సాధించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఎంపీ తన నిధులు సమర్థంగా వినియోగించుకునేందుకు ఇది తోడ్పడుతుంది. అందుకే ఈ రాజ్యాంగ సవరణకు ఉపక్రమించామని అమిత్ షా పేర్కొన్నారు. మల్కాజ్‌గిరిలో దాదాపు 30లక్షల మందికిపైగా ఓటర్లు ఉండగా.. ఢిల్లీ, బెంగళూరు, గాజియాబాద్‌లో 20లక్షలకుపైగా ఓటర్లు ఉన్నారు. డీలిమిటేషన్ తర్వాత ఆయా చోట్ల రెండు సీట్లు వస్తాయి. దీనివల్ల సభ్యులకు, ప్రజలకు ప్రయోజనం చేకూరుతుంది. 1972లో ఇందిరా గాంధీ ప్రభుత్వం లోక్‌సభ సీట్లను 545కు పెంచింది. ఇన్నాళ్లపాటు సీట్లు సంఖ్య పెంచకుండా అడ్డుకున్న ఘనత వారిదే అని కాంగ్రెస్‌పై అమిత్ షా విరుచుకుపడ్డారు. కాలానికి అనుగుణంగా సీట్ల సంఖ్యలోనూ మార్పు రావాలని అన్నారు. ఉత్తరాది.. దక్షిణాది.. ఆ ప్రాంతం.. ఈ ప్రాంతం అంటూ విభజన రాజకీయాలు చేస్తున్నారు. దేశమంతా ఒక్కటే. ఉత్తర, దక్షిణ బేధాలు చూపి దేశాన్ని ముక్కలు చేస్తామంటే కుదరదు. దక్షిణమే కాదు.. కేంద్రపాలిత ప్రాంతాలకు సైతం దేశంపై అంతే అధికారం ఉంటుంది. ప్రాంతాలకు అతీతంగా ఈ సభలోని సభ్యులందరికీ సమాన అధికారం ఉంటుందని అమిత్ షా పేర్కొన్నారు. మహిళా బిల్లును, డీలిమిటేషన్ బిల్లును వేరు చేస్తారా? ఏ రాష్ట్రానికి ఆ రాష్ట్రం 50శాతం పెంచుతారా? అని కాంగ్రెస్ సీనియర్ నేత కేసీ వేణుగోపాల్ ప్రశ్నించారు. దీనికి అమిత్ షా బదులిస్తూ.. 50శాతం పెంచుతూ సవరణ తెచ్చేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. గంట సమయం ఇస్తే బిల్లులో సవరణలు చేసుకొని వస్తామని.. బిల్లుకు మద్దతిస్తారేమో చెప్పాలని అమిత్ షా స్పష్టం చేశారు. కూటమి లక్ష్యంగా ఘాటైన విమర్శలు చేశారు. మహిళలకు రిజర్వేషన్లు కల్పించే చారిత్రాత్మక నిర్ణయాన్ని 'ఇండి' కూటమి సభ్యులు వ్యతిరేకించడం విచారకరమని అమిత్ షా అన్నారు.మహిళా సాధికారత కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలకు మద్దతు ఇవ్వకుండా అడ్డుకోవడం ఎందుకని అమిత్ షా కాంగ్రెస్ పార్టీ మిత్రపక్షాల్ని ప్రశ్నించారు. ప్రస్తుతం ప్రవేశపెట్టిన మూడు బిల్లులకు మహిళా రిజర్వేషన్ల బిల్లుతో విడదీయలేని సంబంధం ఉందని ఆయన వివరించారు. ఈ పక్రియ అంతా ఒక పద్ధతి ప్రకారం సాగుతోందని చెప్పారు. నియోజకవర్గాల పునర్విభజనను వ్యతిరేకించడం అంటే.. ఎస్సీ, ఎస్టీ సీట్ల పెంపును వ్యతిరేకించడమేనని అమిత్ షా అన్నారు. జనాభా ప్రాతిపదికన రిజర్వ్‌డ్ సీట్ల సంఖ్య పెరగాలంటే పునర్విభజన అనివార్యమని స్పష్టం చేశారు. ప్రస్తుతం వివిధ లోక్‌సభ నియోజకవర్గాల జనాభాలో తీవ్రమైన వ్యత్యాసాలు ఉన్నాయని, ప్రజాస్వామ్యబద్ధంగా అందరికీ సమాన ప్రాతినిధ్యం దక్కాలంటే పునర్విభజన అవసరమని అమిత్ షా నొక్కి చెప్పారు. వచ్చే సాధారణ ఎన్నికల నాటికి మహిళా రిజర్వేషన్లు క్షేత్రస్థాయిలో అమలు చేసేలా మోదీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందని అమిత్ షా ప్రకటించారు. సభలో ప్రస్తుతం 56 మంది మహిళా ఎంపీలు ఉండటం శుభపరిణామమని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. మహిళా రిజర్వేషన్లకు విపక్షాలు వ్యతిరేకమనే విషయాన్ని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా తప్పుపట్టారు. వారిది మహిళా వ్యతిరేక మైండ్‌సెంట్ అన్నారు. డీలిమిటేషన్‌పై విపక్షాలు ప్రభుత్వాన్ని నమ్మాలని అన్నారు. పార్లమెంటు సభ్యుల సంఖ్యను విస్తరించేందుకు, వచ్చే ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్లు అమలు చేసేందుకు ముందుకు వెళు న్నామని చెప్పారు. మూడు బిల్లులపై లోక్‌సభలో సమగ్రంగా చర్చ జరిగిందని, అన్ని పార్టీలు తమ వాదనలు వినిపించాయని, ఇండియా కూటమి సభ్యుల్లో చాలామంది మాట్లాడారని అన్నారు. రాజ్యాంగ సవరణ వల్ల దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం బలహీనమవుతుందనడంలో ఎంత మాత్రం నిజం లేదని అమిత్‌షా వివరించారు. బిల్లు ఆమోదం తర్వాత దక్షిణ భారతదేశానికి ప్రాతినిధ్యం వహించే సభ్యులు, శాతం రెండూ పెరుగుతాయని వివరించారు. ప్రస్తుతం 543 మంది లోక్‌సభ సభ్యుల్లో దక్షిణాదిన 129 మంది ఎంపీలు ఉన్నారని, అది 195కు పెరుగుతుందని చెప్పారు. పార్లమెంటులో దక్షిణాది ప్రాతినిధ్యం పెరగడం వల్ల బలమైన గొంతు వినిపించే అవకాశం ఉంటుందని వివరించారు.

# 2023లోనే ఆమోదించిన బిల్లును అమలు చేయండి

**లేదా కొత్తగా మహిళా బిల్లును తీసుకుని రండి**

**ప్రస్తుత బిల్లు మహిళా సాధికరత కోసం పెట్టింది కాదు**

**ఆ ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం**

**బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల క్రూర చర్య**

**చర్చలో మోడీ ఓ మెజీషియన్ అంటూ రా హుల్ తీవ్రంగా విమర్శలు**

**రాహుల్ తీరుపై మండిపడ్డ స్పీకర్ బిర్లా..కేంద్రమంత్రులు**

**న్యూఢిల్లీ,ఏప్రిల్17 :** ఇప్పటికే 2023లోనే మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందిందని, దానినే అమలు చేయాలని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ అన్నారు. ప్రస్తుతం ప్రతిపాదించిన బిల్లు మహిళల సాధికారత కోసం పెట్టింది కాదని విమర్శించారు. ఈ బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. అంతగా కావాలంటే పాత మహిళా రిజర్వేషన్ల బిల్లును రద్దు చేసి.. ఇప్పుడు కొత్తగా మళ్లీ తీసుకురావాలని కేంద్రానికి సూచించారు. లోక్‌సభలో 131వ రాజ్యాంగ సవరణ, డీలిమిటేషన్, కేంద్రపాలిత ప్రాంతాల చట్ట సవరణ బిల్లులపై లోక్‌సభలో చర్చ సందర్భంగా రాహుల్ ఈ వ్యాఖ్యలు చేశారు. మహిళా బిల్లు ముసుగులో దేశ రాజకీయ చిత్రపటాన్ని మార్చే ప్రయత్నం జరుగుతోంది. అంతగా కావాలంటే పాత బిల్లును రద్దు చేసి.. మళ్లీ తీసుకురండి. మేం ఎలాంటి అభ్యంతరాలు చెప్పకుండా మద్దతిస్తాం. బీసీ, దళితులు, మైనార్టీలు, మహిళల పట్ల ఈ బిల్లు క్షమించరాని, క్రూరమైన చర్య. ఓబీసీ సోదరుల నుంచి అధికారం లాక్కునే ప్రయత్నం జరుగుతోందన్నారు. కులగణన ప్రారంభమైందని హోంమంత్రి అమిత్ షా చెప్పారు. ఇప్పుడు కులగణనతో సంబంధం లేకుండా డీలిమిటేషన్ ఎందుకు జరుగుతోందని, విపక్షాలన్నీ దీన్ని ఓడిస్తాయని రాహుల్ గాంధీ అన్నారు. న్యాయవ్యవస్థ, ప్రైవేటు రంగం వంటి కీలక రంగాల్లో ఓబీసీలు, దళితులు ఎక్కడున్నారు? దేశ అత్యున్నత బ్యూరోక్రసీలో వీరు ఎక్కడున్నారు? ఓబీసీలకు అధికారం, భాగస్వామ్యం ఇచ్చేందుకు భాజపా సిద్ధంగా లేదు. తన ప్రాబల్యం తగ్గిపోతోందన్న భయం ఆ పార్టీకి పట్టుకుంది. దక్షిణాది, ఈశాన్య, చిన్న రాష్ట్రాలను భాజపా గౌరవించడం లేదని రాహుల్ ధ్వజమెత్తారు. లోక్‌సభలో రాహుల్ ప్రసంగిస్తూ.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా మోదీని పరోక్షంగా ఇంద్రజాలికుడంటూ రాహుల్ వ్యాఖ్యానిం చడం సభలో గందరగోళానికి కారణమైంది. దీనిపై స్పీకర్ ఓం బిర్లా అభ్యంతరం వ్యక్తం చేయగా.. భాజపా సభ్యులు కూడా రాహుల్ తీరుపై మండిపడ్డారు. ప్రధాన మంత్రిని అవమానిస్తున్నారని, ఇందుకు రాహుల్ వెంటనే క్షమాపణ చెప్పాలని కేంద్ర మంత్రులు రాజ్‌నాథ్ సింగ్, కిరణ్ రిజిజు డిమాండ్ చేశారు. మహిళా రిజర్వేషన్ బిల్లు ద్వారా దేశంలో



కులగణన డిమాండ్‌ను పక్కదారి పట్టించే ప్రయత్నం జరుగుతోందన్నారు. 'ఈ బిల్లు ఆమోదం పొందదని బీజేపీకి కూడా తెలుసు. వాళ్లంత తెలివతక్కువ వాళ్లు కాదు. ఈ బిల్లును విపక్షంలోని ప్రతి ఒక్కరూ వ్యతిరేకిస్తారని వాళ్లకు తెలుసు. అయినా ప్రధాని రెండు సందేశాలు పంపాలనుకున్నారు. ఇందులో మొదటిది.. దేశ ఎలక్టోరల్ మ్యాప్‌ను ఆయన మార్చాలను కున్నారు. రెండవది.. తాను మహిళా పక్షపాతినని మరోసారి చాటిచెప్పాలని అనుకున్నారు. బాలాకోట్ మెజిషియన్, డీమోనిటైజేషన్ మెజియన్, సిందూర్ మెజిషియన్ అక్షస్మాత్తుగా పట్టుబడ్డారు' అని రాహుల్ వ్యాఖ్యానించారు. ప్రధానమంత్రిని ఉద్దేశించి రాహుల్ చేసిన వ్యాఖ్యలపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రధానిపై అభ్యంతరకరమైన భాష వాడటాన్ని తప్పుపట్టారు. బాలాకోట్ దాడులు, ఆపరేషన్ సిందూర్ ప్రస్తావనతో దేశాన్ని, మిలటరీని అవమానపరుస్తున్నారని అన్నారు. దేశ ప్రధానమంత్రి గురించి విపక్ష నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమని, ఆ వ్యాఖ్యాలను రికార్డులను నుంచి తొలగించాలని స్పీకర్ ఓం బిర్లాను రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ కోరారు. అందుకు స్పీకర్ అంగీకరించారు.

# రాహుల్ గాంధీ ద్వంద్వ పౌరసత్వం

**బ్రిటన్ పౌరసత్వం కలిగి ఉన్నట్లు ఆరోపణలు**

**విచారణకు ఆదేశించిన అలహాబాద్ హైకోర్టు**

**న్యూఢిల్లీ,ఏప్రిల్17 :** ద్వంద్వ పౌరసత్వం ఆరోపణలకు సంబంధించి లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీపై కేసు నమోదు చేయాలని అలహాబాద్ హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. దీనిపై విచారణ జరపాలని అక్కడి లఖ్‌నవూ బెంచ్ ఉత్తర్వులిచ్చింది. ఈ కేసు దర్యాప్తును ఉత్తర్‌ప్రదేశ్ ప్రభుత్వమే స్వయంగా నిర్వహించాలని లేదంటే.. ఒక కేంద్ర దర్యాప్తు సంస్థకు అప్పగించాలని పేర్కొంది. రాహుల్ గాంధీ పౌరసత్వం అంశంపై కొన్నేళ్లుగా వివాదం నలుగుతూనే ఉంది. రాహుల్ గాంధీ బ్రిటన్ పౌరుడని, భారత పౌరసత్వాన్ని రద్దు చేయాలంటూ భాజపా నేత సుబ్రహ్మణ్య స్వామి, కర్ణాటకకు చెందిన భాజపా కార్యకర్త విఘ్నేశ్ శిశిర్ డిమాండ్ చేస్తున్నారు. బ్రిటన్‌లో నమోదైన ఓ కంపెనీకి రాహుల్ గాంధీ డైరెక్టర్, సెక్రటరీగా ఉన్నారని సుబ్రహ్మణ్య స్వామి కొంతకాలంగా చెబుతున్నారు. ఆ కంపెనీ వార్షిక నివేదికలో తనను తాను బ్రిటిష్ పౌరుడిగా రాహుల్ గాంధీ పేర్కొన్నట్లు స్వామి తెలిపారు. వేరే దేశంలో పౌరుడిగా ఉన్న వ్యక్తి ఆ దేశ పౌరసత్వాన్ని స్వచ్ఛందంగా వదులుకోవాల్సి ఉంటుందన్నారు. అలా చేయకపోవడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 9, భారతీయ పౌరసత్వ చట్టం, 1955ని ఉల్లంఘించడమే అవుతుందని పేర్కొన్నారు. ఇదే అంశంపై గతంలో కేంద్రానికి కూడా లేఖ రాశారు. మరోవైపు, రాహుల్ గాంధీ పౌరసత్వానికి సంబంధించిన రికార్డులు ఉన్నాయని విఘ్నేశ్ చెబుతున్నారు. ఈ క్రమంలోనే న్యాయస్థానాలను ఆశ్రయించారు. పౌరసత్వానికి సంబంధించిన అంశాలపై నిర్ణయం తీసుకునే అధికారం తనకు లేదంటూ లఖ్‌నవూలోని ప్రత్యేక ఎంపీ/ఎమ్మెల్యే కోర్టు గతంలో శిశిర్ పిటిషన్‌ను తోసిపుచ్చింది. దాంతో అతడు అలహాబాద్ హైకోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలోనే తాజా ఆదేశాలు వెలువడ్డాయి.

# టైటాన్స్ హ్యాట్రిక్..

## కోల్‌కతాపై ఘన విజయం
## శుభ్‌మన్ గిల్ విజృంభణ
## గ్రీన్ అర్ధసెంచరీ వృథా

అహ్మదాబాద్ : ఐపీఎల్‌లో గుజరాత్ టైటాన్స్ హ్యాట్రిక్ విజయాలను అందుకుంది. శుక్రవారం కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో జరిగిన పోరులో టైటాన్స్ 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. కోల్‌కతా నిర్దేశించిన 181 పరుగుల లక్ష్యాన్ని గుజరాత్ 19.4 ఓవర్లలో 5 వికెట్లు కోల్పోయి ఛేదించింది. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(50 బంతుల్లో 86, 8ఫోర్లు, 4సిక్స్‌లు) అర్ధసెంచరీతో అదరగొట్టాడు. కోల్‌కతా బౌలర్లను దీటుగా ఎదుర్కొన్న గిల్ బౌండరీలతో దుమ్మురేపాడు. చక్రవర్తి(2/34) రెండు వికెట్లతో ఆకట్టుకున్నాడు. తొలుత కేకేఆర్.. నిర్ణీత ఓవర్లలో 180 రన్స్‌కు ఆలౌట్ అయింది. ఈ సీజన్‌లో దారుణంగా విఫలమవుతూ విమర్శల పాలవుతున్న పాతిక కోట్ల ఆసీస్ ఆల్‌రౌండర్ కామెరూన్ గ్రీన్ (55 బంతుల్లో 79, 7 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఎట్టకేలకు స్థాయికి తగ్గ ప్రదర్శన చేయడంతో నైట్‌రైడర్స్ గౌరవప్రదమైన స్కోరుచేయగల్గింది. రబాడ(3/29), సిరాజ్(2/23) రాణించారు.

### గ్రీన్ ఎట్టకేలకు..

సీజన్ ఆరంభం నుంచి బ్యాటింగ్ వైఫల్యాలతో నిరాశపరుస్తున్న కోల్''కథ'.. అహ్మదబాద్‌లోనూ మారలేదు. విధ్వంసకర ఓపెనర్ అలెన్‌ను కాదని సీఫర్ట్ (19)ను ఆడించినా ఫలితంలో మార్పు లేదు. సారథిగానే గాక బ్యాటర్‌గానూ విఫలమవుతున్న రహానే.. సిరాజ్ తొలి ఓవర్లో ఎదుర్కున్న మొదటి బంతికే సున్నాచుట్టగా ఫామ్‌లో ఉన్న రఘువంశీ (8), రబాడా బౌలింగ్‌లో కీపర్ బట్లర్ చేతికి చిక్కాడు. రెండు బౌండరీలు, ఒక ఫోర్ బాదిన సీఫర్ట్‌ను రబాడా పెవిలియన్‌కు పంపడంతో పవర్ ప్లేలో ఆ జట్టు 37/3తో నిలిచింది. ఈ దశలో గ్రీన్‌కు జతకలిసిన పావెల్ (27) కొద్దిసేపు వికెట్ల పతనాన్ని అడ్డుకున్నాడు. జీటీ బౌలర్లపై పావెల్ ఎదురుదాడికి దిగగా గ్రీన్ మాత్రం ఆచితూచి ఆడాడు. నాలుగో వికెట్‌కు 55 పరుగులు జతచేసిన ఈ జోడీని.. 11వ ఓవర్లో అశోక్ శర్మ విడదీశాడు. పావెల్ నిష్క్రమించాక బాదుడు బాధ్యతను గ్రీన్ భుజానికెత్తుకున్నాడు. రషీద్ ఓవర్లో 6, 4 బాదిన అతడు.. అశోక్ బౌలింగ్‌లో రెండు సిక్స్‌లతో ఈ సీజన్‌లో తన తొలి అర్ధ శతకాన్ని నమోదుచేశాడు. అనుకుల్ (9)తో ఐదో వికెట్‌కు 60 రన్స్ జోడించడంతో 14.3 ఓవర్లకు కేకేఆర్ 145/4తో పటిష్ట స్థితిలోనే కనబడింది. కానీ ప్రసిద్ధ్.. అనుకుల్‌ను ఔట్ చేయడంతో కథ మళ్లీ మొదటికొచ్చింది. రింకూ (1), రమణ్‌దీప్ (17), నరైన్ తేలిపోయారు. చివరి 4 ఓవర్లలో ఆ జట్టు 32 రన్స్ మాత్రమే చేసి ఐదు వికెట్లను చేజార్చుకుంది.

### గిల్ కెప్టెన్ ఇన్నింగ్స్

సాయి సుదర్శన్ (22), కెప్టెన్ గిల్ మెరుపులు మెరిపించడంతో ఛేదనను జీటీ ధాటిగా ఆరంభించింది. అనుకుల్ మూడో ఓవర్లో 20 రన్స్ రాబట్టిన ఈ జోడీ.. కార్తీక్ త్యాగి, వైభవ్ అరోరా బౌలింగ్‌లోనూ దూకుడు ప్రదర్శించడంతో టైటాన్స్ స్కోరుబోర్డు పరుగులు పెట్టింది. పవర్ ప్లే ఆఖరి ఓవర్‌లో సాయిని నరైన్ ఔట్ చేసినా మూడో స్థానంలో వచ్చిన బట్లర్ (25) ఆరంభం నుంచే ఫోర్లతో విరుచుకుపడ్డాడు. వరుణ్ 8ఓవర్లో భారీ సిక్స్ కొట్టిన బట్లర్.. అతడే వేసిన పదో ఓవర్లో తొలి బంతికి లాంగాన్‌లో గ్రీన్ చేతికి చిక్కడంతో జీటీ రెండో వికెట్ కోల్పోయింది. అయితే అప్పటికే క్రీజులో కుదురుకున్న గిల్.. నరైన్ ఓవర్లో సింగిల్‌తో మరో అర్ధ శతకాన్ని నమోదుచేశాడు. సాయితో తొలి వికెట్‌కు 57, బట్లర్‌తో రెండో వికెట్‌కు 38 రన్స్ జతచేసిన అతడు.. మూడోవికెట్‌కు వాషింగ్టన్‌తో కలిసి జట్టును విజయతీరాలకు చేర్చాడు. ఫిఫ్టీ తర్వాత జోరు పెంచి భారీ షాట్లతో విరుచుకుపడ్డ జీటీ సారథి...లక్ష్యం దిశగా పయనించాడు. సాఫీగా సాగుతున్న సమయంలో అరోరా బౌలింగ్‌లో గ్రీన్ సూపర్ క్యాచ్‌తో గిల్ ఔటయ్యాడు. ఫిలిప్స్(19) ఔటైనా..తెవాటియా(7 నాటౌట్), షారుక్‌ఖాన్(0 నాటౌట్) గెలుపు లాంఛనాన్ని పూర్తి చేశారు.



### సంక్షిప్త స్కోర్లు

కోల్‌కతా: 20 ఓవర్లకు 180 ఆలౌట్ (గ్రీన్ 79, పావెల్ 27, రబాడా 3/29, సిరాజ్ 2/23);

గుజరాత్: 19.4 ఓవర్లలో 181/5(గిల్ 86, బట్లర్ 25, చక్రవర్తి 2/34, రమణ్‌దీప్ 1/5)

# కోహ్లీ ఒక్క లైక్‌తో సోషల్ మీడియాలో ట్రెండ్

ఒకే ఒక్క లైక్... సోషల్ మీడియానే షేక్ చేస్తోంది. ఇండియన్ స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లీ తాజాగా మోడల్ లిజ్‌లాజ్ పోస్ట్ లైక్ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. దీనిపై నెటిజన్లు నెట్టింట మీమ్స్‌తో హల్చల్ చేస్తున్నారు. ఒక్కసారిగా సదరు మోడల్ పేరు నెట్టింట ట్రెండ్ అయిపోయింది. ఇన్‌ఫ్లుయెన్సర్ లిజ్‌లాజ్ పోటోలతో కూడిన పోస్టును కోహ్లీ లైక్ చేయడం వైరల్‌గా మారింది. ఆమెను ఫాలో కానప్పటికీ లైక్ కొట్టడం చర్చనీయాంశమైంది. జర్మనీకి చెందిన ఈమె 'గోల్డెన్ అవర్ షాట్స్' అంటూ తన ఫోటోలను షేర్ చేసింది. జనవరి 30న పెట్టిన ఈ పోస్టుకు కోహ్లీ లైక్ కొట్టినట్లు కనిపించింది. దీన్ని ఆయన అభిమానులు సోషల్ మీడియాలో తెగ షేర్ చేస్తున్నారు. అయితే, ఇది అనుకోకుండా జరిగిందా? అల్గారిథమ్ వల్ల జరిగిందా? అంటూ డిబేట్ మొదలెట్టారు. కొందరు ఫన్ ఎమోజీస్‌తో నింపేశారు. అసలు ఆమె ఎవరు? అంటూ తెగ సెర్చ్ చేస్తున్నారు. లిజ్ లాజ్ జర్మనీకి చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్. సగం సౌతాఫ్రికాకు చెందిన మూలాలు కూడా ఉన్నాయి. ఎంఎస్సీ సైకాలజీ కంప్లీట్ చేసింది. వ్లోగర్, సింగర్‌గా తన ఇన్ స్టా ఐడీని పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ... ట్రావెల్ వ్లాగ్స్, లైఫ్ స్టైల్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు షేర్ చేస్తుంటుంది. ఆర్సీబీకి ఫ్యాన్స్ అంటూ తాజాగా ఓ వీడియోను తన ఇన్ స్టా స్టోరీలో పెట్టుకుంది. సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్ అద్వైత్ వైద్య ఆమెతో ఫోటో షూట్ చేయగా... వాటిని ఇన్ స్టాలో షేర్ చేశారు. ఇప్పటివరకూ లిజ్‌లాజ్‌కు దాదాపు 4.27 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. 274 పోస్టులు చేశారు. సాక్షాత్తూ భారత క్రికెట్ లెజెండ్ ఆమె పోస్టుకు లైక్ చేయడంతో ఒక్కసారిగా ఫేమస్ అయిపోయారు. లిజ్ లాజ్ జర్మనీకి చెందిన ఇన్‌ఫ్లుయెన్సర్. సగం సౌతాఫ్రికాకు చెందిన మూలాలు కూడా ఉన్నాయి. ఎంఎస్సీ సైకాలజీ కంప్లీట్ చేసింది. వ్లోగర్, సింగర్‌గా తన ఇన్ స్టా ఐడీని పెట్టుకున్నారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉంటూ... ట్రావెల్ వ్లాగ్స్, లైఫ్ స్టైల్ కంటెంట్, మ్యూజిక్ వీడియోలు షేర్ చేస్తుంటుంది. ఆర్సీబీకి ఫ్యాన్స్ అంటూ తాజాగా ఓ వీడియోను తన ఇన్ స్టా స్టోరీలో పెట్టుకుంది. సెలబ్రిటీ ఫోటోగ్రాఫర్ అద్వైత్ వైద్య ఆమెతో ఫోటో షూట్ చేయగా... వాటిని ఇన్ స్టాలో షేర్ చేశారు. ఇప్పటివరకూ లిజ్‌లాజ్‌కు దాదాపు 4.27 లక్షల మంది ఫాలోవర్స్ ఉన్నారు. 274 పోస్టులు చేశారు. సాక్షాత్తూ భారత క్రికెట్ లెజెండ్ ఆమె పోస్టుకు లైక్ చేయడంతో ఒక్కసారిగా ఫేమస్ అయిపోయారు.





# హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ ఆశించిన స్థాయిలో లేదు

## హార్దిక్ పాండ్యాపై మనోజ్ తివారీ విమర్శలు


ఐపీఎల్ 2026 సీజన్లో భాగంగా ముంబై ఇండియన్స్ జట్టు వరుస పరాజయాలతో సతమతమవుతోంది. ఇప్పటివరకు ఆడిన 5 మ్యాచ్‌ల్లో కేవలం ఒకే ఒక్క విజయాన్ని నమోదు చేసిన ముంబై ఇండియన్స్.. పాయింట్ల పట్టికలో అట్టడుగు నుంచి రెండో స్థానంలో ఉంది. గురువారం పంజాబ్ కింగ్స్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో కూడా ఘోరంగా ఓడిపోవడంతో కెప్టెన్ హార్దిక్ పాండ్యాపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కేవలం మార్చి 29న కోల్‌కతా నైట్ రైడర్స్ జట్టుపై మాత్రమే ముంబై ఇండియన్స్ విజయం సాధించింది. ముంబై ఇండియన్స్ వైఫల్యాలపై మాజీ క్రికెటర్ మనోజ్ తివారీ ఘాటుగా స్పందించారు. హార్దిక్ పాండ్యా కెప్టెన్సీ ఆశించిన స్థాయిలో లేదని.. జట్టును ముందుండి నడిపించడంలో హార్దిక్ విఫలమవుతున్నాడని విమర్శించారు. రోహిత్ శర్మ సారథ్యంలో ముంబై జట్టు 2013 నుంచి 2023 మధ్య 5 ట్రోఫీలను గెలుచుకుందని గుర్తు చేసిన మనోజ్ తివారీ.. రోహిత్‌ను కెప్టెన్సీ నుంచి తొలగించడం ద్వారా ఫ్రాంచైజీ పెద్ద అన్యాయం చేసిందని అభిప్రాయపడ్డారు."హార్దిక్ పాండ్యా తనంతట తానుగా కెప్టెన్సీ బాధ్యతల నుంచి తప్పుకుని, తిరిగి రోహిత్ శర్మకు పగ్గాలు అప్పగించాలి" అని మనోజ్ తివారీ సూచించారు. గత రెండేళ్లుగా ముంబైకి ట్రోఫీ రాలేదని.. ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే ఈ ఏడాది కూడా అదే పునరావృతమయ్యేలా ఉందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. జట్టులో ఐకమత్యం లోపించిందని, కెప్టెన్ నిర్ణయాలు సరిగ్గా లేవని ఆయన కుండబద్దలు కొట్టారు. పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ తీసుకున్న నిర్ణయాలను మనోజ్ తివారీ తప్పుబట్టారు. విధ్వంసకర బ్యాటర్ షెర్ఫాన్ రూథర్‌ఫోర్డ్‌ను కాదని, హార్దిక్ తనను తాను బ్యాటింగ్ ఆర్డర్‌లో ముందుకు ప్రమోట్ చేసుకోవడం వల్ల జట్టు నష్టపోయిందని విమర్శించారు. అలాగే జస్ప్రీత్ బుమ్రాతో మొదటి ఓవర్ వేయించకపోవడం.. ఫామ్‌లో లేని దీపక్ చాహర్‌కు బంతిని ఇవ్వడం వంటి వ్యూహాత్మక లోపాలు ముంబై ఓటమికి కారణమయ్యాయని ఆయన విశ్లేషించారు.

# వరల్డ్‌కప్‌లో మ్యాచ్ ఫిక్సింగ్ కలకలం

భారత్ – శ్రీలంక సంయుక్తంగా ఆతిథ్యమిచ్చిన 2026 టీ20 ప్రపంచకప్ గతనెల విజయవంతంగా ముగిసింది. ఈ టోర్నీ ఫైనల్?లో న్యూజిలాండ్?ను చిత్తుగా ఓడించి భారత్ విశ్వవిజేతగా నిలిచింది. అయితే ఈ టోర్నమెంట్ ముగిసి నెల రోజులు గడిచిన తర్వాత తాజాగా దీనిపై ఓ షాకింగ్ వార్త వెలుగులోకి వచ్చింది. టోర్నీలో న్యూజిలాండ్?తో జరిగిన మ్యాచ్?లో కెనడా మ్యాచ్ ఫిక్సింగ్?కు పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. దీంతో ఈ మ్యాచ్?పై ఐసీసీ తాజాగా విచారణ ప్రారంభించింది. చెన్నై చెపాక్ స్టేడియం వేదికగా కెనడా – న్యూజిలాండ్ జట్ల మధ్య లీగ్ స్టేజ్?లో? మ్యాచ్ జరిగింది. ఇందులో కివీస్ 8 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించి సూపర్ 8కు దూసుకొచ్చింది. అయితే ఈ మ్యాచ్?లో కెనడా మ్యాచ్ ఫిక్సింగ్?కు పాల్పడిందని ఇటీవల సీబీసీ ఓ డాక్యుమెంటరీ రూపొందించింది. ఇది ఇప్పుడు క్రికెట్ ప్రపంచాన్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. ఈక్రమంలోనే కెనడా క్రికెట్ జట్టుపై ఐసీసీ అవినీతి నిరోధక విభాగం రెండు కీలక విచారణలను ప్రారంభించినట్లు ఈఎస్?పీఎన్ క్రిక్ఇన్ఫో నివేదిక పేర్కొంది. ఈ మ్యాచ్ ఛేజింగ్?లో? కివీస్ నాలుగు ఓవర్లకు 35– 2 స్కోర్?తో ఉంది. అయితే ఆ తర్వాత కెనడా కెప్టెన్ దిల్ప్రీత్ బాజ్వా వేసిన ఐదో ఓవర్?లో ఒక 'నో– బాల్', ఓ 'వైడ్' సహా 15 పరుగులు వచ్చాయి. ఆ ఓవర్ తర్వాత మ్యాచ్ స్వరూపమే మారిపోయింది. కివీస్ బ్యాటర్లు రెచ్చిపోయి ఆడాడు. ఫలితంగా కివీస్ 174 పరుగుల ఛేదనలలో 15.1 ఓవర్లలో అందుకుంది. అయితే మ్యాచ్?లో ఆ ఓవర్ టర్నింగ్ పాయింట్ అయ్యింది. ఈ క్రమంలో కెప్టెన్ బజ్వా వేసిన ఓవర్?పై అనుమానాలు మొదలయ్యాయి. మ్యాచ్?లో ఆ ఓవర్ అనుమానస్పదంగా మారిందని కెనడాకు చెందిన ఇన్వెస్టిగేషన్ కార్యక్రమం 'ది ఎఫ్త్ ఎస్టేట్' పేర్కొంది. అది నిజంగానే పేలవమైన బౌలింగా, లేక కెప్టెన్ ఉద్దేశపూర్వకంగానే అన్ని పరుగులు ఇచ్చేశాడా? అన్న అశంలో ఐసీసీ విచారణ జరుపుతోంది. ఇప్పుడు ఈ ఓవర్ విచారణ పరిధిలోకి వచ్చింది. అది నిజంగానే పేలవమైన బౌలింగా, లేక కెప్టెన్ ఉద్దేశపూర్వకంగానే అన్ని పరుగులు ఇచ్చేశాడా? దీనికి ఏదైనా 'స్పాట్ – ఫిక్సింగ్' లేదా బెట్టింగ్‌తో సంబంధం ఉందా? అనే కోణంలో విచారణ జరుపుతోంది. ఇలాంటి వ్యవహారాలపై ఎప్పటికప్పుడు స్పందించే స్థితిలో ఏసీయూ లేదని ఐసీసీ తాత్కాలిక జీఎం అండ్రూ ఎఫ్?గ్రేవ్ తెలిపారు. దీని గురించి విచారణ తర్వాతే అసలు నిజాలు తేలుతాయని పేర్కొన్నారు. అయితే ఇక్కడ గమనించదగ్గ విషయం ఏమిటంటే, 2026 టీ20 ప్రపంచ కప్ ప్రారంభానికి కేవలం మూడు వారాల ముందే బాజ్వా కెనడా జాతీయ జట్టు కెప్టెన్‌గా నియమితుడయ్యాడు. కెనడా క్రికెట్ జట్టు ప్రస్తుతం క్లిష్ట సమయాన్ని ఎదుర్కొంటోంది. ఆటగాళ్లపై వచ్చిన అవినీతి ఆరోపణలే కాకుండా, జట్టు ఎంపికలో జరిగిన అవకతవకలను వెల్లడించే ఒక టెలిఫోన్ సంభాషణ రికార్డింగ్ కూడా బయటపడింది. ఆ ఆడియో ఇప్పుడు వైరల్‌గా మారింది. అందులో, జాతీయ జట్టులోకి కొందరు ఆటగాళ్లను పక్కాగా ఎంపిక చేయాలని తనపై ఒత్తిడి వచ్చిందని మాజీ కోచ్ ఖుర్రం చౌహాన్ పేర్కొన్నట్లు అందులో ఉంది. తనపై ఒత్తిడి తెచ్చిన వ్యక్తులు బోర్డులోని సీనియర్ సభ్యులేనని అతను తెలిపాడు.

# నా రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొడతాడు

## గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్



టీమిండియా స్టార్ క్రికెటర్, గుజరాత్ టైటాన్స్ ఆల్‌రౌండర్ వాషింగ్టన్ సుందర్ కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీపై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేశారు. శుభ్‌మన్ గిల్ కెప్టెన్సీలో అత్యంత కీలక విషయం క్లారిటీ అని వాషింగ్టన్ సుందర్ పేర్కొన్నారు. స్టేడియంలోకి వెళ్లే ముందే ప్రతి ఆటగాడికి తన బాధ్యత ఏంటో.. కెప్టెన్ తన నుంచి ఏం ఆశిస్తున్నాడో గిల్ చాలా స్పష్టంగా వివరిస్తాడని సుందర్ చెప్పుకొచ్చాడు. ఈ విధానం వల్ల ఆటగాళ్లపై ఒత్తిడి తగ్గి, ప్రశాంతంగా తమ సహజసిద్ధమైన ఆటను ఆడగలుగుతున్నారని పేర్కొన్నాడు. భారత క్రికెట్‌లో ప్రస్తుతం సెన్సేషన్‌గా మారిన బీహార్ యువ ఆటగాడు వైభవ్ సూర్యవంశీ గురించి వాషింగ్టన్ సుందర్ గొప్పగా మాట్లాడాడు. టీ20 క్రికెట్‌లో భారత్ తరపున అరంగేట్రం చేసిన అత్యంత పిన్న వయస్కుడిగా తన పేరిట ఉన్న రికార్డును వైభవ్ సూర్యవంశీ బద్దలు కొట్టే అవకాశం ఉందని ఆయన అభిప్రాయపడ్డాడు. వైభవ్ వయసు తక్కువైనా అతని ఆలోచనా విధానం, నైపుణ్యం చూస్తుంటే చాలా ఆశ్చర్యంగా ఉంటుందని, అతడు భవిష్యత్తులో టీమిండియాకు సుదీర్ఘ కాలం ఆడుతాడని వాషింగ్టన్ సుందర్ ఆశాభావం వ్యక్తం చేశాడు. టీమిండియా డ్రెస్సింగ్ రూమ్‌కు, గుజరాత్ టైటాన్స్ డ్రెస్సింగ్ రూమ్‌కు పెద్దగా తేడా ఏమీ లేదని సుందర్ తెలిపాడు. ఇక్కడ ఆటగాళ్లందరి మధ్య మంచి సమన్వయం ఉందని, జట్టులోని భారతీయ ఆటగాళ్లంతా టీమిండియాలో కూడా కలిసి ఆడిన వారు కావడంతో ఒకరి గురించి ఒకరికి బాగా తెలుసని చెప్పాడు. కేవలం మైదానంలోనే కాకుండా టీమ్ రూమ్‌లో కూడా అందరం కలిసి ఎక్కువ సమయం గడపడం వల్ల ఓ కుటుంబంలా కలిసిపోయామని, ఈ వాతావరణమే గుజరాత్ టైటాన్స్ జట్టును ప్రత్యేకంగా నిలుపుతుందని పేర్కొన్నాడు. కోచ్ ఆశిష్ నెహ్రా గురించి మాట్లాడుతూ.. ఆయనతో కలిసి పనిచేయడం ఎప్పుడూ గొప్ప అనుభూతినిస్తుందని వాషింగ్టన్ సుందర్ తెలిపాడు. గత నాలుగేళ్లుగా గుజరాత్ జట్టుతో నెహ్రాకు ఉన్న అనుబంధం అద్భుతమని, ఆయన ఆటగాళ్ల బలాలు, బలహీనతలను చాలా సులభంగా అర్థం చేసుకుంటారని కొనియాడాడు. ఐపీఎల్ తన జీవితాన్ని మార్చివేసిందని, 2017లో మొదలైన తన ప్రయాణం ఇప్పుడు ఒక దశాబ్దానికి చేరువవుతోందని, సీనియర్ ఆటగాడిగా తన బాధ్యతలను నెరవేర్చేందుకు సిద్ధంగా ఉన్నానని వాషింగ్టన్ సుందర్ స్పష్టం చేశాడు.




## హీటెక్కిస్తున్న మానుషి!

ప్రపంచ సుందరిగా కిరీటాన్ని కైవసం చేసుకున్న మానుషి చిల్లర్ చిత్ర పరిశ్రమలో తన అదృష్టాన్ని పరీక్షించుకోవడంలో మాత్రం వెనుకబడిందనే చెప్పాలి. ఐశ్వర్యారాయ్, సుస్మితా సేన్, ప్రియాంక చోప్రా వంటి మాజీ విశ్వసుందరిలు వెండితెరపై మకుటం లేని మహారాణులుగా వెలుగొందగా..మానుషికి మాత్రం ఆ స్థాయి లక్ కలిసిరావడం లేదు. అందాల పోటీల వేదికపై భారత కీర్తిని చాటిన ఈ భామ.. నటిగా తనకంటూ ఒక బలమైన ముద్ర వేయడానికి ఇంకా పోరాడుతూనే ఉంది. సినిమా కెరీర్ ఆరంభం నుండి మానుషికి ఆశించిన విజయాలు దక్కలేదు. తెలుగులో భారీ అంచనాల మధ్య విడుదలైన -ఆపరేషన్ వాలెంటైన్- బాక్సాఫీస్ వద్ద నిరాశ పరిచింది. ఇక హిందీలో చేసిన చిత్రాలు కూడా తన కెరీర్‌కు ఊపునివ్వలేకపోయాయి. 2025లో ఒకటి రెండు సినిమాల్లో మెరిసినా.. ఈ ఏడాదిలో ఇప్పటివరకు తన చేతిలో చెప్పుకోదగ్గ ప్రాజెక్టులు ఏవీ లేకపోవడం గమనార్హం. నటిగా నిలదొక్కుకోవడానికి మానుషి చేస్తున్న ప్రయత్నాలు ప్రస్తుతానికి ఫలితాలను ఇవ్వడం లేదు. 2024లో బడే మియాన్ చోటే మియాన్, 2025లో ఆపరేషన్ వేలెంటైన్ లాంటి చిత్రాలపై మానుషి చాలా హోప్స్ పెట్టుకుంది. కానీ అవన్నీ బాక్సాఫీస్ వద్ద పరాజయం పాలవ్వడంతో నిజంగా మరోసారి అన్ లక్కీ గాళ్ అని ప్రూవైంది. నటన పరంగా వెనుకబడిపోయినా తనకున్న -మిస్ వరల్డ్- హోదాను మానుషి చక్కగా ఉపయోగించుకుంటోంది. వరుసగా ప్రముఖ కంపెనీల వాణిజ్య ప్రకటనల్లో నటిస్తూ బిజీగా గడుపుతోంది. ఈ బ్రాండ్ ప్రమోషన్లను తన సోషల్ మీడియా ఖాతాల ద్వారా నిరంతరం షేర్ చేస్తూ అభిమానులకు చేరువలో ఉంటోంది. సినిమాల్లో అవకాశాలు లేకపోయినా యాడ్స్, ఈవెంట్స్ ద్వారా తన పాపులారిటీని కాపాడుకుంటూ ఆర్థికంగా నిలకడగా కొనసాగుతోంది. అయితే ఇటీవల మానుషి సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తున్న ఫోటోగ్రాఫ్స్ నెట్టింట సెగలు పుట్టిస్తున్నాయి. గతంలో ట్రెడిషనల్ లుక్స్‌తో పద్ధతిగా కనిపించిన ఈ సుందరి.. ఇప్పుడు తన పంథాను మార్చుకున్నట్లు కనిపిస్తోంది. తాజాగా మానుషి షేర్ చేసిన స్కై బ్లూ బికినీ ఫోటోషూట్ ఇంటర్నెట్‌ను షేక్ చేస్తోంది. గ్లామర్ డోస్ పెంచి మునుపటి కంటే బోల్డ్‌గా కనిపిస్తూ కుర్రకారును మంత్రముగ్ధులను చేస్తోంది. ఈ మార్పు వెనుక తన నటన చాతుర్యంతో పాటు గ్లామర్ యాంగిల్ కూడా ఉందని మేకర్స్‌కు గుర్తు చేసే ప్రయత్నం ఉందా అనే చర్చ మొదలైంది.

# తప్పు ట్రైన్ ఎక్కితే దిగిపోవడమే మంచిది..

## విడాకులపై స్పందించిన హన్సిక!



తెలుగు, తమిళ చిత్రాలతో 'యాపిల్ బ్యూటీ'గా పేరు తెచ్చుకున్న హన్సిక, తన విడాకుల వార్తలపై ఎట్టకేలకు మౌనం వీడారు. భర్త సోహెల్ కతురియాతో నాలుగేళ్ల బంధానికి స్వస్తి పలుకుతూ ముంబై కోర్టులో విడాకులు తీసుకున్నట్లు వస్తున్న వార్తలపై ఆమె తనదైన శైలిలో స్పందించారు. "మనం తప్పు ట్రైన్ ఎక్కామని తెలిసినప్పుడు, వీలైనంత త్వరగా దిగిపోవడమే మంచిది" అంటూ వైవాహిక బంధం ముగియడంపై ఆమె చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయి. తన నిర్ణయం పట్ల తనకు ఎలాంటి పశ్చాత్తాపం లేదని ఆమె స్పష్టం చేశారు. జనాలకు హెడ్ లైన్స్, క్లిక్ బైట్స్ కావాలి కానీ, తనకు వ్యక్తిగత ప్రశాంతత అంతకంటే ముఖ్యమని హన్సిక పేర్కొన్నారు. విడాకుల తర్వాత మానసిక ప్రశాంతత కోసం జపాన్ వెళ్లి వచ్చానని, ఈ కష్టకాలంలో తన కుటుంబం అండగా నిలిచిందని తెలిపారు. 2022లో అట్టహాసంగా జరిగిన ఈ వివాహం, ఓటీటీలో డాక్యుమెంటరీగా కూడా విడుదలైంది. అప్పట్లో హన్సిక తన స్నేహితురాలి మాజీ భర్త అయిన సోహెల్ ను పెళ్లాడడం చర్చనీయాంశం అయింది. ఇప్పుడు వీరిద్దరి బంధం కూడా ముగియడం అభిమానులను ఆశ్చర్యానికి గురిచేస్తోంది. ఏదేమైనా, తన శ్రేయస్సుకే ప్రాధాన్యతనిస్తూ హన్సిక తీసుకున్న ఈ నిర్ణయంపై నెటిజన్ల నుంచి భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



## సమంత కెరీర్ గ్రాఫ్..గ్యాప్!

ఏ మాయ చేసావే అంటూ అడుగుపెట్టిన సమంత అనతి కాలంలోనే అగ్ర హీరోయిన్‌గా ఎదిగారు. కెరీర్ ఆరంభంలో అమ్మడి ప్రయాణం ఒక ప్రభంజనంలా సాగింది. మహేష్ , పవన్ కళ్యాణ్, ఎన్టీఆర్ వంటి అగ్ర హీరోలందరి సరసన నటించి గోల్డెన్ లెగ్ గా పేరు తెచ్చుకున్నారు. తెలుగుతో పాటు తమిళంలోనూ వరుస విజయాలు సాధిస్తూ సౌత్ ఇండియాలోనే అత్యధిక పారితోషికం తీసుకునే కథానాయికలలో ఒకరిగా సత్తా చాటారు. ఆ సమయంలో ఆమె కెరీర్ గ్రాఫ్ నిరంతరం ఎదుగుతూనే ఉంది. అయితే వ్యక్తిగత జీవితంలో చోటుచేసుకున్న పరిణామాలు సమంత వృత్తిపరమైన వేగాన్ని ప్రభావితం చేసాయి అన్నది కాదనలేని నిజం. వివాహం తర్వాత కూడా ఆమె-రంగస్థలం-, మజిలీ, ఓ బేబీ వంటి చిత్రాలతో నటనలోని వైవిధ్యాన్ని నిరూపించు కున్నారు. కానీ వైవాహిక జీవితంలో విడిపోవడం , ఆ తర్వాతి కాలంలో ఎదురైన ఆరోగ్య సమస్యలు ఆమెను సినిమాలకు కొంతకాలం దూరం చేశాయి. మయోసైటిస్ వ్యాధి వల్ల శారీరకంగా, మానసిక సిద్ధంగా బలపడటానికి ఆమె కావాలనే సినిమాలకు సుదీర్ఘ విరామం ప్రకటించిన సంగతి తెలిసిందే. అయితే సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభించిన తర్వాత సమంత కేవలం వెండితెరకే పరిమితం కాకుండా డిజిటల్ మాధ్యమంపై దృష్టి సారించారు. ప్రస్తుతం సమంత ఎంపిక చేసిన ప్రాజెక్టులకే మొగ్గు చూపుతున్నారు. సమంత తన వ్యక్తిగత జీవితానికి , వృత్తికి మధ్య సమతుల్యత సాధించే క్రమంలోనే ఈ స్థాయిలో గ్యాప్ తీసుకున్నట్లు స్పష్టమవుతోంది. రాజ్ నిడిమోరుతో వివాహం తర్వాత ఆమె వ్యక్తిగత జీవితం మళ్లీ స్థిరపడినట్లు కనిపిస్తున్నా? సినీ కెరీర్ విషయంలో మాత్రం ఆమె ఇంకా పాత వైభవం కోసం వేచి చూడాల్సి వస్తోంది. ఒకప్పుడు ఏడాదికి మూడు నాలుగు సినిమాలు చేసే స్థాయి నుండి ఇప్పుడు ఒక్క సినిమా విడుదల కోసం అభిమానులు ఏళ్ల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడింది. ప్రస్తుతం సమంత సెకండ్ ఇన్నింగ్స్‌లో క్వాంటిటీ కంటే క్వాలిటీ కే ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఆమె నిర్ణయాలు చెబుతున్నాయి. సామా ఆరంభంలో కమర్షియల్ స్టార్‌గా వెలిగిపోయారు. కానీ నేడు ఒక పరిణతి చెందిన నటిగా, నిర్మాతగా తనకంటూ ఒక ప్రత్యేక మార్గాన్ని నిర్మించుకునే ప్రయత్నంలో ఉన్నారు. ఈ గ్యాప్ తర్వాత ఆమె చేసే సినిమాలు పూర్వ వైభవాన్ని తెచ్చిపెడతాయా ? లేదా? అన్నది ఆసక్తికరంగా మారింది. కెరీర్ సెకండ్ హాఫ్‌లో ఆమె తీసుకోబోయే నిర్ణయాలే భవిష్యత్తులో ఆమె స్థానాన్ని డిసైడ్ చేస్తాయన్నది కాదనలేని నిజం.



# టీవీ చుట్టూ అల్లిన పల్లెటూరి కథ

టీవీలు అప్పుడప్పుడే ఊళ్లలోకి ప్రవేశిస్తున్న 90వ దశకం నేపథ్యంలో తిమ్మరాజుపల్లి అనే పల్లెటూళ్లో జరిగే కథ ఇది. శివరాత్రి వచ్చిందంటే ఊరి వాళ్లంతా కలిసికట్టుగా చందాలేసుకుని పండగ ఘనంగా జరిపించడం.. ఆ సాయంత్రం అద్దెకి తెచ్చుకున్న టీవీలో కొత్త సినిమాలు చూసి ఆనందించడం పరిపాటి. అలాంటి ఊళ్లోకి తొలిసారి సొంతంగా ఓ టీవీ కొనుక్కుని తెచ్చుకుంటాడు రాజప్ప (ప్రదీప్ కొట్టె). ఎప్పుడైతే ఆ ఇంట్లోకి టీవీ వచ్చిందో.. అప్పటి నుంచి ఊరి వాళ్ల బుల్లితెర వినోదాలకు రాజప్ప ఇల్లు చిరునామాగా మారిపోతుంది. ఆ ఊళ్లో చిల్లర దొంగతనాలు చేస్తూ గడిపేసే సతీష్ (సాయితేజ్) కూడా టీవీ చూడటానికని వచ్చి.. రాజప్ప చెల్లి శారద (వేద జలంధర్)తో ప్రేమాయణం సాగిస్తుంటాడు. ఓసారి ఈ ప్రేమ విషయం రాజప్పకి తెలియడంతో పెద్ద గొడవ జరుగుతుంది. సతీష్‌ని తీవ్రంగా అవమానించడంతో.. 'ఏ టీవీని చూసైతే విర్రవీగుతున్నావో దాన్ని లేకుండా చేస్తాన'ని సవాల్ విసురుతాడు. సరిగ్గా అదే రాత్రి రాజప్ప ఇంట్లో టీవీ దొంగతనం జరగడంతో ఆ నింద సతీష్‌పై పడుతుంది. మరి ఆ తర్వాత ఏమైంది? నిజంగా ఆ టీవీని ఎవరెత్తుకెళ్లారు? తనపై నింద తప్పని నిరూపించుకునేందుకు సతీష్ ఏం చేశాడు? ఊరి పెద్దలిచ్చిన రెండు వారాల గడువు లోపల ఆ టీవీని.. అసలు దొంగల్ని తను కనిపెట్టాడా? లేదా? ఈక్రమంలో తనకెదురైన సవాళ్లేంటి? అన్నది మిగిలిన కథ. ఇప్పుడు అరచేతిలోకి వినోదాలు వచ్చేశాక టీవీ ప్రాధాన్యం ఎవరికీ పెద్దగా తెలియట్లేదు కానీ.. 80-90ల తరానికి టీవీ అంటే ఓ ఎమోషన్. బుల్లితెరతో పెనవేసుకున్న అనుబంధాలు.. దాని చుట్టూ అల్లుకున్న జ్ఞాపకాలు బోలెడన్ని. ఈ 'తిమ్మరాజుపల్లి టీవీ'తో ఆ జ్ఞాపకాల్ని.. ఆ అనుబంధాల్ని మరోసారి గుర్తు చేసే ప్రయత్నం చేశాడు దర్శకుడు మునిరాజ్. మలయాళ సినిమాల్లోలా చాలా సింపుల్ లైన్‌పై నడిచే చిత్రమిది. ఈ కథ ప్రధానంగా ఓ టీవీ దొంగతనం చుట్టూ తిరుగుతుంటుంది. సింగిల్ లైన్ కథలతో ప్రేక్షకుల్ని రెండు గంటల పాటు థియేటర్లలో కూర్చోబెట్టడం అంత తేలికేం కాదు. కథలో బలమైన డ్రామా పండినప్పుడే అది సాధ్యం. ఈ విషయంలో 'తిమ్మరాజుపల్లి టీవీ' పాసైంది. దర్శకుడు ఈ కథకి ఎలాంటి కమర్షియల్ హంగులు జోడించకుండా చాలా నిజాయితీగా తెరపై ఆవిష్కరించే ప్రయత్నం చేశారు. ఆ ఊరివాళ్ల మనస్తత్వాల్ని.. అక్కడి సంస్కృతి, సంప్రదాయాల్ని పరిచయం చేస్తూ కథని ఆరంభించిన తీరు బాగుంటుంది. నాయకానాయికల ప్రేమకథ ఎప్పుడైతే రాజప్పకి తెలుస్తుందో.. అక్కడి నుంచి కథలో సంఘర్షణ మొదలవుతుంది. ఇక తన ఇంట్లో టీవీ దొంగతనానికి గురైనప్పటి నుంచి కథ మరింత రసవత్తరంగా మారుతుంది. ఈక్రమంలో వచ్చే విరామ సన్నివేశాలు ఫర్వాలేదనిపిస్తాయి. తెరపై కనిపించేదంతా కొత్త వా÷-లకైనా ప్రేక్షకులకు అదెక్కడా ఇబ్బందిగా అనిపించదు. నాయకానాయికలతో పాటు తెరపై కనిపించే ప్రతి పాత్రా సహజమైన నటనతో గుర్తుండిపోతుంది. ఎల్లమ్మ పాత్రతో ఇచ్చిన ట్విస్ట్ ఆకట్టుకుంటుంది. దర్శకుడు తాను అనుకున్న కథని నిజాయితీగా చెప్పడంలో విజయం సాధించాడు. దీన్ని పూర్తిగా ఓ ప్లలెటూరిలోనే చాలా సహజంగా తెరకెక్కించారు. కిరణ్ అబ్బవరం నిర్మాతగా తొలి ప్రయత్నంలో చాలా తక్కువ బడ్జెట్‌లో ఆహ్లాదభరితమైన సినిమా చూపించగలిగారు. పాటలన్నీ కథలో భాగంగా ఉన్నాయి. నేపథ్య సంగీతం సినిమాకి మంచి ఫీల్‌ని జోడించింది. విజువల్స్ ఆకర్షణగా నిలుస్తాయి.

# ఎల్లమ్మ చెరువు సుందరీకరణ పనులు వేగవంతం

**అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్ స్థల పరిశీలన**
**వాకింగ్ ట్రాక్, రక్షణ గోడ, పచ్చదనం పనులపై దృష్టి**
**వర్షాకాలానికి ముందే పనులు పూర్తి చేయాలని ఆదేశాలు**
**పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని లక్ష్యం**
**ప్రజలకు వినోద కేంద్రంగా మారనున్న ఎల్లమ్మ చెరువు**



హుస్నాబాద్,జనత న్యూస్: హుస్నాబాద్ పట్టణ సుందరీకరణలో భాగంగా ఎల్లమ్మ చెరువును సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దే పనులను ప్రభుత్వం వేగవంతం చేసింది. ఇందులో భాగంగా శుక్రవారం పట్టణంలోని ఎల్లమ్మ చెరువు వద్ద జరుగుతున్న అభివృద్ధి, సుందరీకరణ పనులను అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) అబ్దుల్ హమీద్ క్షేత్రస్థాయిలో పర్యవేక్షించారు.మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మి, కమిషనర్ టి. మల్లికార్జున్ ఇతర ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన చెరువు కట్ట వెంబడి జరుగుతున్న పనులను పరిశీలించారు.ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.... చెరువు చుట్టూ నిర్మిస్తున్న నడక దారి, రక్షణ గోడ, పచ్చదనం పెంపొందించే పనుల పురోగతిని అధికారులను అడిగి తెలుసుకున్నారు. పట్టణ ప్రజలకు ఆహ్లాదాన్ని పంచేలా, అన్ని హంగులతో ఈ చెరువును పర్యాటక కేంద్రంగా సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. పనుల్లో నాణ్యత విషయంలో ఎట్టి పరిస్థితుల్లోనూ రాజీ పడవద్దని, వర్షాకాలం ప్రారంభం కాకముందే ప్రధాన నిర్మాణ పనులన్నీ పూర్తి చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.మున్సిపల్ చైర్పర్సన్ దండి లక్ష్మి మాట్లాడుతూ... హుస్నాబాద్ పట్టణ రూపురేఖలను మార్చేలా అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని, ఎల్లమ్మ చెరువును స్థానికులకు ఒక చక్కని వినోద కేంద్రంగా మార్చడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్పర్సన్ చిత్తారి పద్మ, వార్డు కౌన్సిలర్ భూక్యా సంపత్, వివిధ శాఖల అధికారులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదు

**ఉద్యోగుల బకాయిలను వెంటనే చెల్లించాలి**
**లిఈఎన్సీ ఆఫీస్ ఎదుట ఉద్యోగుల నిరసన**




తిమ్మాపూర్, జనతా న్యూస్ : ఉద్యోగులను నిర్లక్ష్యం చేసిన గత ప్రభుత్వానికి బుద్ధి చెప్పామని, ఉద్యోగులకు రావాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని, మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని టీఎన్జీవో ఉద్యోగ సంఘ నాయకులు హెచ్చరించారు. రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు ఉద్యోగుల దీర్ఘకాలిక సమస్యల పరిష్కారం కోసం శుక్రవారం భోజన విరామ సమయంలో నల్ల బ్యాడ్జీలు ధరించి ఎల్ఎండిలోని కరీంనగర్ ఇరిగేషన్ కార్యాలయం ఎదుట నినాదాలు చేసి నిరసన తెలిపారు. తిమ్మాపూర్ తాసిల్దార్ కార్యాలయం ఎదుట తాసిల్దార్ శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో కార్యాలయ ఉద్యోగులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఉద్యోగ సంఘ నాయకులు మాట్లాడుతూ... పెండింగ్ బిల్లులు, ఈహెచ్ఎస్, పిఆర్సి, మెడికల్ బిల్లులు, జిపిఎఫ్ లు, పెన్షనర్ల బెనిఫిట్లను విడుదల చేయాలని, ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు.

మేనిఫెస్టోలో పెట్టిన ఉద్యోగుల హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయ కుండా మోసం చేసిందని అన్నారు. టీఎన్జీవో తిమ్మాపూర్ యూనిట్ అధ్యక్షులు పోలు కిషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు రాగి శ్రీను, హరికృష్ణ, పవన్,జిల్లా నాయకులు గంగారపు రమేష్, వి.ప్రసాద్, సరిత, ఎన్జిపిఏల సంఘం అధ్యక్ష కార్యదర్శులు .రామచంద్ర రెడ్డి, వేంకటేశ్వర రావు, టీఎన్జీ వో ఎల్ఎండి యూనిట్ కార్యదర్శి అంబటి నాగరాజు, ట్రెజరర్ పుప్పాల అశోక్ రెడ్డి, ధనలక్ష్మి, పి.శ్రీను, కయ్యం శ్రీను, అజ్గర్, లావణ్య, మహేందర్, క్లాస్ ఫోర్ అధ్యక్ష కార్యదర్శి బుర్ర రాజయ్య, ఎఫ్ఫ.రాజయ్య, రిటైర్డ్ యూనియన్ అధ్యక్షులు, కార్యదర్శి కుమ్మరి నారాయణ, వెంకటేశ్వర్లు, ఉద్యోగులు, పెన్షనర్లు, గెజిటెడ్ అధికారులు పాల్గొన్నారు.

# ఫైర్ సిబ్బంది సేవలు ప్రశంసనీయం

**హుస్నాబాద్‌లో అగ్నిమాపక సిబ్బందికి సన్మానం**




హుస్నాబాద్,జనత న్యూస్: పట్టణంలోని ఫైర్ స్టేషన్‌లో శుక్రవారం అగ్నిమాపక సిబ్బందికి సన్మాన కార్యక్రమం నిర్వహించారు.అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా వాసవి క్లబ్ గ్రేటర్ హుస్నాబాద్, వనిత క్లబ్‌ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... అగ్నిప్రమాదాల నివారణలో ఫైర్ సిబ్బంది ప్రాణాలకు తెగించి సేవలు అందిస్తూ ప్రజల ప్రాణాలు, ఆస్తులను కాపాడుతున్నారని కొనియాడారు. వారి సేవలు సమాజానికి ఎంతో మేలుచేస్తున్నాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో ఫైర్ స్టేషన్ ఎస్ఐ సిహెచ్ రాజయ్య, వాసవి క్లబ్ అధ్యక్షుడు వనపర్తి వంశీ, ప్రధాన కార్యదర్శి కంభంపాటి సందీప్, కోశాధికారి గౌరిశెట్టి రవితేజ, వనిత క్లబ్ అధ్యక్షురాలు చొల్లేటి లత, కోశాధికారి మల్యాల రాధిక, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.

# ట్రాక్టర్ బోల్తా... యువరైతు మృతి





చిగురుమామిడి, జనత న్యూస్: కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండలం లంబాడిపల్లె గ్రామంలో శుక్రవారం విషాదం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన కాటం కిషన్ రెడ్డి (28) వ్యవసాయ పనులు ముగించుకొని ట్రాక్టర్‌లో వడ్లు తరలిస్తుండగా ప్రమాదవశాత్తు వాహనం బోల్తా పడింది. ఈ ఘటనలో ట్రాక్టర్ టైరు కిందపడి ఆయన అక్కడికక్కడే మృతి చెందారు .సమాచారం అందుకున్న పోలీసులు, గ్రామ సర్పంచ్ కాటం సంపత్ రెడ్డి సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని బయటకు తీశారు. మృతుడి తండ్రి లింగారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై పృథ్వీదర్ గౌడ్ తెలిపారు.కిషన్ రెడ్డికి భార్య, తల్లిదండ్రులు ఉన్నారు. ఆకస్మిక మరణంతో గ్రామంలో విషాదం నెలకొంది. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు, ప్రజాప్రతినిధులు కోరారు. వ్యవసాయ పనుల సమయంలో ట్రాక్టర్ నడిపేటప్పుడు జాగ్రత్తలు పాటించాలని పోలీసులు సూచించారు.

# ఫీజు రీయింబర్స్‌మెంట్ ఎత్తివేతకు సర్కారు కుట్ర!

**ఎస్ఎఫ్ఐ హుస్నాబాద్ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ మండిపాటు**

**హైకోర్టులో కౌంటర్ దాఖలు చేయకపోవడంపై విమర్శలు**



హుస్నాబాద్,జనత న్యూస్: పేద, బడుగు బలహీన వర్గాల విద్యార్థులను ఉన్నత విద్యకు దూరం చేసేలా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసేందుకు కుట్ర పన్నుతోందని ఎస్ఎఫ్ఐ హుస్నాబాద్ మండల కార్యదర్శి లక్ష్మణ్ నాయక్ ఆరోపించారు.శుక్రవారం హుస్నాబాద్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ తీరుపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై ప్రైవేట్ విద్యాసంస్థలు హైకోర్టును ఆశ్రయించిన సమయంలో, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగానే కౌంటర్ దాఖలు చేయలేదని లక్ష్మణ్ విమర్శించారు. సర్కారు వైఫల్యం వల్లే ప్రైవేట్ కళాశాలలు విద్యార్థుల నుంచి నేరుగా ఫీజులు వసూలు చేసుకోవచ్చని హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చే పరిస్థితి నెలకొందని, ఇది పేద విద్యార్థుల పాలిట శాపంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఏటా సుమారు 14 లక్షల మంది విద్యార్థులు ఈ పథకంపై ఆధారపడి ఇంజినీరింగ్, ఫార్మా, మెడిసిన్ వంటి కోర్సులు చదువుతున్నారని ఆయన గుర్తుచేశారు.ప్రభుత్వం సుమారు పది వేల కోట్ల రూపాయల బకాయిలను విడుదల చేయకుండా పెండింగ్‌లో పెట్టిందని, దీనివల్ల ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల విద్యార్థులకు ఉన్నత విద్య అందని ద్రాక్షగా మారుతుందని హెచ్చరించారు. ప్రభుత్వం తక్షణమే స్పందించి పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధులను విడుదల చేయాలని, లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా భారీ ఎత్తున విద్యార్థి ఉద్యమాలను చేపడతామని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తరుణ్, తిరుపతి, సురేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మండల కేంద్రంలో పందుల బెడదతో ప్రజల ఇబ్బందులు - అధికారులకు వినతి




జనత న్యూస్ బెజ్జంకి: మండల కేంద్రంలో జనావాసాల మధ్య పందుల పెంపకంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. పందుల వల్ల దుర్వాసన, కాలుష్యం పెరిగి అనారోగ్య సమస్యలు తలెత్తుతున్నాయని పలు కుటుంబాలు ఆవేదన వ్యక్తం చేశారు.

ఈ సమస్యపై తక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతూ శుక్రవారం స్థానికులు బెజ్జంకి తహసిల్దార్ శ్రీకాంత్, ఎంపీడీవో ప్రవీణ్ మరియు బెజ్జంకి ఎస్ఐ సౌజన్యకు వినతి పత్రం అందజేశారు. పందుల బెడద నుండి తమను రక్షించాలని, ఆరోగ్య సమస్యలు మరింత పెరగకుండా చర్యలు తీసుకోవాలని వారు అధికారులను కోరారు.

# తహసీల్దార్‌కు వినతి సమర్పించిన ఉపాధ్యాయులు



జనత న్యూస్ బెజ్జంకి: మండలంలో ఉపాధ్యాయులు మరియు ఉద్యోగ సంఘాల నాయకులు తహసీల్దార్ శ్రీకాంత్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని వారు కోరారు. తెలంగాణ ఉద్యోగుల జేఏసీ పిలుపు మేరకు భోజన విరామ సమయంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పీఆర్సీ అమలు, పెండింగ్ బిల్లుల చెల్లింపు, హెల్త్ కార్డుల జారీ, ఓపీఎస్ పునరుద్ధరణ వంటి ప్రధాన డిమాండ్లను అధికారులు దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొని తమ సమస్యలను తహసీల్దార్‌కు వివరించారు.

# తిమ్మాయిపల్లి గ్రామంలో చలివేంద్రం ఏర్పాటు



జనత న్యూస్ బెజ్జంకి: మండలంలోని తిమ్మాయిపల్లి గ్రామంలో సర్పంచ్ దేవనబోయిన సత్యవ్వ--పోచయ్య చేతుల మీదుగా శుక్రవారం చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వాహన దారులకు,గ్రామ ప్రజలకు వేసవి కాలంలో తాగునీటి సౌకర్యం కల్పించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ సెక్రటరీ శ్రీనివాస్, గ్రామపంచాయతీ వార్డు సభ్యులు, సిఏ రేణుక,సంధ్య, శ్రీలత, కల్లూరి ప్రభాకర్, కల్లూరి బాలయ్య, చాడ బాల్ రెడ్డి, దేవనబోయిన అంజయ్య తదితరులు పాల్గొన్నారు.

# జీవన్‌రెడ్డి కలిసిన కేడిఆర్



తిమ్మాపూర్, జనతా న్యూస్ : ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి, జగిత్యాల మాజీ ఎంఎల్ఏ, సీనియర్ నాయకులు జీవన్ రెడ్డిని బిఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, మాజీ కరీంనగర్ కేడిసిసిబి డైరెక్టర్ కేతిరెడ్డి

దేవేందర్ రెడ్డి కలిశారు. జగిత్యాలలోని జీవన్ రెడ్డి నివాసంలో కలిసి ఈనెల 20న జగిత్యాలలో జరిగే కెసిఆర్ బహిరంగసభ విషయం మాట్లాడారు. మండలం నుండి అధిక సంఖ్యలో కార్యకర్తలను తరలించాలని, సభ విజయవంతమునకు అందరూ కృషి చేయాలని కోరారు.

# పెండింగ్ సమస్యలు పరిష్కరించాలి

**టీజీఈ జేఏసీ.. తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేత**



చిగురుమామిడి,జనత న్యూస్: సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని టీజీఈ జేఏసీ (తెలంగాణ ఎంప్లాయీస్, టీచర్స్ అండ్ పెన్షనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ) డిమాండ్ చేసింది. రాష్ట్ర జేఏసీ పిలుపులో భాగంగా శుక్రవారం చిగురుమామిడి మండల కేంద్రంలో ఉద్యోగులు, ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.అనంతరం భోజన విరామ సమయంలో తహసీల్దార్ కార్యాలయానికి చేరుకుని తహసీల్దార్ ముద్దసాని రమేష్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా జేఏసీ నాయకులు మాట్లాడుతూ.. గత కొంతకాలంగా ఉద్యోగులకు రావాల్సిన డీఏ (కరువు భత్యం) బకాయిలు, ఇతర ఆర్థిక ప్రయోజనాలు పెండింగ్‌లో ఉండటం వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేశారు.పీఆర్సీ (వేతన సవరణ సంఘం) నివేదికను త్వరితగతిన అమలు చేయాలని, పదవీ విరమణ చేసిన వారికి అందాల్సిన బెనిఫిట్స్ సకాలంలో విడుదల చేయాలని కోరారు.ప్రభుత్వం స్పందించి సానుకూల నిర్ణయం తీసుకోని పక్షంలో జేఏసీ ఆధ్వర్యంలో ఆందోళనలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని వివిధ శాఖల ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాధాకృష్ణన్ ఆశయాలు యువతకు మార్గదర్శకం

**అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో వర్ధంతి నిర్వహణ**



కరీంనగర్, ఏప్రిల్ 17: అల్ఫోర్స్ ఇ-టెక్నో స్కూల్‌లో డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ వర్ధంతిని పురస్కరించుకుని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ భారతదేశ చరిత్రలో విశిష్ట స్థానం సంపాదించిన మహనీయుడని అన్నారు. రాష్ట్రపతిగా, దేశపు మొదటి ఉపరాష్ట్రపతిగా సేవలందిస్తూ ప్రజల సంక్షేమానికి కృషి చేసిన గొప్ప నాయకుడని కొనియాడారు. ఉపాధ్యాయ వృత్తిని గౌరవప్రదంగా నిలబెట్టి, విద్యార్థుల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిన ఆదర్శ వ్యక్తిగా రాధాకృష్ణన్ నిలిచారని పేర్కొన్నారు. ఆయన చేసిన సేవలకు గాను భారత ప్రభుత్వం అత్యున్నత పురస్కారం 'భారతరత్న' ప్రదానం చేయడంతో పాటు, ఆయన జన్మదినాన్ని ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రకటించడం ఆయన గొప్పతనానికి నిదర్శనమని తెలిపారు. వివిధ విశ్వవిద్యాలయాల్లో ప్రొఫెసర్‌గా పనిచేసి విద్య యొక్క ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటి చెప్పారని, విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడంలో కీలక పాత్ర పోషించారని అన్నారు. భారత రాయబారిగా సేవలందిస్తూ దేశ గౌరవాన్ని పెంచిన గొప్ప తత్వవేత్తగా కూడా ఆయన గుర్తింపు పొందారని పేర్కొన్నారు. హిందూ వేదాంతాన్ని పాశ్చాత్య ప్రపంచానికి పరిచయం చేసిన మహోన్నత తాత్వికుడని కొనియాడారు. ప్రతి ఒక్కరూ డాక్టర్ రాధాకృష్ణన్‌ను ఆదర్శంగా తీసుకుని విద్య, సేవా భావంతో ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వానకాలం పంటల సాగుకు రైతులు సన్నద్ధం కావాలి

**ఫార్మర్ రిజిస్ట్రీ, ఈ-క్రాప్ నమోదు తప్పనిసరి: జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి**



కరీంనగర్, ఏప్రిల్ 15: రాబోయే వానకాలం (ఖరీఫ్) పంటల సాగుకు రైతులు ముందుగానే సన్నద్ధం కావాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి సూచించారు. కరీంనగర్ ఏడీఏ కార్యాలయంలో నిర్వహించిన సమీక్షా సమావేశంలో అధికారులకు, సిబ్బందికి పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, వానకాలం సీజన్ ప్రారంభానికి ముందే రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. రైతులకు అవసరమైన సాంకేతిక మార్గదర్శకాలు కూడా అందించనున్నట్లు చెప్పారు. ఫార్మర్ రిజిస్ట్రీపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని సూచిస్తూ, భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం అమలు చేసే సంక్షేమ పథకాలు, సబ్సిడీలు పొందాలంటే ఫార్మర్ రిజిస్ట్రీ తప్పనిసరి అవుతుందని స్పష్టం చేశారు. ప్రతి రైతు రిజిస్ట్రీ పూర్తి చేసుకోవాలని, ఈ ప్రక్రియను వచ్చే నెలలోపు 100 శాతం పూర్తి చేయాలని ఏఈఓలకు ఆదేశించారు. గ్రామ స్థాయిలో రైతులకు అవగాహన కల్పించి, అవసరమైతే మీ సేవా కేంద్రాల ద్వారా కూడా నమోదు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. డిజిటల్ క్రాప్ బుకింగ్ (ఈ-క్రాప్) కార్యక్రమాన్ని సమయానికి పూర్తి చేయాలని పేర్కొన్నారు. రైతుల పంట వివరాలు సక్రమంగా నమోదు చేస్తే భవిష్యత్తులో నష్టపరిహారం, ఇతర ప్రభుత్వ ప్రయోజనాలు సులభంగా అందుతాయని తెలిపారు. ఈ ప్రక్రియలో ఏఈఓలు, డీసీఎస్ వాలంటీర్లు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పంటల మార్పిడి విధానాన్ని ప్రోత్సహిస్తూ, పప్పు ధాన్యాలు, చిరు ధాన్యాలు, నూనె గింజల సాగుపై రైతులు దృష్టి పెట్టాలని కోరారు. అదేవిధంగా మట్టి ఆరోగ్యం మెరుగుపరచడానికి ప్రతి గ్రామంలో సాయిల్ వాలంటీర్లను గుర్తించి శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. సిఫారసు మేరకు ఎరువులు వాడితే రైతుల ఖర్చులు తగ్గడంతో పాటు దిగుబడులు పెరుగుతాయని చెప్పారు. రైతులు తమ మొబైల్ నంబర్లను వ్యవసాయ అధికారుల వద్ద అప్‌డేట్ చేసుకోవాలని, తద్వారా యూరియా యాప్, ప్రభుత్వ పథకాల సమాచారం నేరుగా అందుతుందని తెలిపారు. ఉద్యానవన శాఖ సహకారంతో కూరగాయల సాగును ప్రోత్సహించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు. ఈ సమావేశంలో సహాయ వ్యవసాయ సంచాలకులు రణధీర్ రెడ్డి, కరీంనగర్ అర్బన్, రూరల్, కొత్తపల్లి మండల వ్యవసాయ అధికారులు వంశీకృష్ణ, సత్యం, సంతోష్ కుమార్‌తో పాటు ఏఈఓలు పాల్గొన్నారు.

# రోడ్డు భద్రత సామాజిక బాధ్యత - ప్రతి ప్రాణం అమూల్యం





## 'అరైవ్ అలైవ్'తో ప్రమాదరహిత తెలంగాణ సాధ్యం: డీజీపీ బి. శివధర్ రెడ్డి

కరీంనగర్, ఏప్రిల్ 17: రోడ్డు ప్రమాదాలను నివారించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని, ప్రతి ప్రాణం అమూల్యమని తెలంగాణ రాష్ట్ర డీజీపీ బి. శివధర్ రెడ్డి పేర్కొన్నారు. వాహనదారులు సురక్షితంగా తమ గమ్యానికి చేరుకోవాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం పోలీస్, రవాణా శాఖల సమన్వయంతో చేపట్టిన 'అరైవ్ అలైవ్' కార్యక్రమాన్ని సామాజిక ఉద్యమంగా ముందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో శాంతిభద్రతల కంటే రోడ్డు ప్రమాదాలే పెద్ద సవాలుగా మారాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. గత ఏడాది హత్యల వల్ల 800 మంది మరణించగా, రోడ్డు ప్రమాదాల్లో 7500 మంది ప్రాణాలు కోల్పోయినట్లు వెల్లడించారు. డీజీపీ మాట్లాడుతూ, రోడ్డు భద్రత కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, గ్రామస్థాయి ప్రజాప్రతినిధి నుండి ముఖ్యమంత్రి వరకు అందరూ భాగస్వాములు కావాలని తెలిపారు. అందుకే 'ప్రజా పాలన -- ప్రగతి ప్రణాళిక'లో ఈ కార్యక్రమాన్ని చేర్చినట్లు చెప్పారు.

ద్విచక్ర వాహన ప్రమాదాల్లో 70 శాతం మరణాలు జరుగుతున్నాయని పేర్కొంటూ, బైక్ నడిపేవారితో పాటు వెనుక కూర్చున్న వారు కూడా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని సూచించారు. హెల్మెట్ స్ట్రాప్ తప్పనిసరిగా పెట్టుకోవాలని, లేకపోతే ప్రమాద సమయంలో హెల్మెట్ పనిచేయదని హెచ్చరించారు. హెల్మెట్ వల్ల వెంట్రుకలు ఊడిపోతాయనే అపోహలను నమ్మవద్దని, హెల్మెట్ ధరించడం ప్యాంటుకు బెల్ట్ పెట్టుకున్నంత సహజంగా అలవాటు చేసుకోవాలని సూచించారు. ఫోర్ వీలర్ వాహనాల్లో సీట్ బెల్ట్ తప్పనిసరి అని, అది లేకుంటే ఎయిర్ బ్యాగులు కూడా సరిగ్గా పనిచేయవని తెలిపారు.

మద్యం సేవించి డ్రైవింగ్, రాంగ్ రూట్ ప్రయాణం, ఓవర్ కాన్ఫిడెన్స్ వంటి కారణాల వల్ల అనేక కుటుంబాలు నష్టపోతున్నాయని చెప్పారు. 'డిఫెన్సివ్ డ్రైవింగ్' పాటించాలని, జంక్షన్లు, పాఠశాలల వద్ద వేగాన్ని తగ్గించాలని సూచించారు. పాదచారులు ఎల్లప్పుడూ వాహనాలకు ఎదురుగా నడవాలని సూచించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను హెచ్చరిస్తూ, లైసెన్స్ వచ్చిన తర్వాతే వాహనాలు ఇవ్వాలని స్పష్టం చేశారు. 'అరైవ్ అలైవ్' సందేశాన్ని గ్రామ గ్రామానికి తీసుకెళ్లి ప్రమాదరహిత తెలంగాణ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా డీజీపీ స్కై బెలూన్, పోస్టర్, 'అరైవ్ అలైవ్' పాట సీడీని ఆవిష్కరించారు. విద్యార్థులకు హెల్మెట్లు పంపిణీ చేసి, రోడ్డు భద్రతపై ప్రతిజ్ఞ చేయించారు. పోలీస్ శాఖ ఏర్పాటు చేసిన స్టాళ్లను సందర్శించారు.జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా మాట్లాడుతూ, 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా 'అరైవ్ అలైవ్' కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. రహవీర్, ఉచిత వైద్యం, హిట్ అండ్ రన్ కేసుల్లో ఆర్థిక సహాయం వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. కరీంనగర్ సీపీ గౌస్ ఆలం మాట్లాడుతూ, ఈ కార్యక్రమం డీజీపీ శివధర్ రెడ్డి ఆలోచనగా ప్రారంభమై మూడు దశల్లో విజయవంతంగా కొనసాగుతోందన్నారు. జిల్లాలో ఇప్పటికే 600కి పైగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. డ్రైవర్లకు ఉచిత కంటి పరీక్షలు, సీపీఆర్ శిక్షణ అందించినట్లు చెప్పారు. గతంతో పోలిస్తే ప్రమాద మరణాలు 16 శాతం తగ్గినట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని, డీఎంహెచ్ఓ వెంకటరమణ, ఎంవీఐ చక్రవర్తి, ట్రైనీ ఐపీఎస్ సోహం సునీల్, అడిషనల్ డీసీపీ వెంకటరమణతో పాటు పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# గిరిజన వసతి గృహాల్లో సదుపాయాలపై రాజీ లేదు

**బాలికలకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలి: కలెక్టర్ చిత్రా మిశ్రా**

కరీంనగర్, ఏప్రిల్ 18: గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని బాలికల వసతి గృహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. బాలికల సౌకర్యాల విషయంలో నిర్లక్ష్యం అసలు సహించబోమని స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి కరీంనగర్ నగరంలోని రామ్‌నగర్‌లో ఉన్న గిరిజన సంక్షేమ శాఖ బాలికల వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. వసతి గదులు, వంటగది, మరుగుదొడ్లు, పరిశుభ్రత పరిస్థితులను పరిశీలించారు. విద్యార్థినులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు.

వసతి గృహం పరిశుభ్రంగా ఉండేలా చూడాలని, దోమల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన, రుచికరమైన భోజనం అందించాలని అధికారులను ఆదేశించారు. బాలికల భద్రత, ఆరోగ్యం విషయంలో ఎలాంటి



అజాగ్రత్తకు తావు ఉండకూడదని హెచ్చరించారు. అవసరాలుంటే వెంటనే తమ దృష్టికి తీసుకురావాలని విద్యార్థినులకు సూచించారు.

**ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం వేగవంతం చేయాలి**

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు. నగరంలోని నాలుగో డివిజన్ గోపాల్పూర్‌లో జరుగుతున్న ఇండ్ల నిర్మాణ పనులను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. నిర్మాణ పనులు నాణ్యతతో కొనసాగాలని, డిజైన్‌లో మార్పులు లేకుండా పూర్తి చేయాలని సూచించారు. బిల్లులు పెండింగ్ లేకుండా చెల్లించాలని, లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

**సఖి కేంద్ర సేవలు మరింత బలోపేతం చేయాలి**

సప్తగిరి కాలనీలో ఉన్న సఖి కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, సేవలపై సమీక్షించారు. బాధితులకు తక్షణ సహాయం, కౌన్సిలింగ్ అందిస్తూ వారికి భరోసా కల్పించాలని అధికారులను ఆదేశించారు. కేంద్రానికి వచ్చే ప్రతి బాధితుడికి అండగా నిలవాలని సూచించారు. రికార్డులను పరిశీలించి నిర్వహణపై సూచనలు చేశారు.

ఈ కార్యక్రమాల్లో డిటిడిఓ సంగీత, అర్బన్ తహసిల్దార్ నరేందర్, గృహనిర్మాణ శాఖ పీడీ శ్రీనివాస్, సంక్షేమ అధికారి సరస్వతి, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

# మహిళా రిజర్వేషన్ బిల్లుపై ప్రతిపక్షాల వైఖరి విచారకరం

**నారీ శక్తి వందన్ చట్టానికి అడ్డంకులు తగిలించడం దురదృష్టకరం: కవిత**




కరీంనగర్, ఏప్రిల్ 17: మహిళలకు రాజకీయ ప్రాతినిధ్యం కల్పించే నారీ శక్తి వందన్ అధినియం వంటి చారిత్రక చట్టానికి ప్రతిపక్షాలు అడ్డంకులు సృష్టించడం విచారకరమని బీజేపీ రాష్ట్ర నాయకురాలు, సినీనటి కవిత పేర్కొన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు అడ్డుపడడం ద్వారా ప్రతిపక్షాల కపట వైఖరి బయటపడిందని విమర్శించారు. బీజేపీ మహిళా మోర్చా ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్‌లో గీతా భవన్ నుంచి కళాభారతి వరకు నారీ శక్తి వందన్ పాదయాత్ర నిర్వహించారు. అనంతరం కళాభారతిలో జరిగిన మహిళల సమావేశంలో కవిత ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించే నారీ శక్తి వందన్ చట్టం దేశ చరిత్రలో నిలిచిపోయే గొప్ప నిర్ణయమని అన్నారు. దశాబ్దాలుగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లుకు మోదీ ప్రభుత్వం కార్యరూపం దాల్చే ప్రయత్నం చేస్తుండగా, ప్రతిపక్షాలు రాజకీయ ప్రయోజనాల కోసం అడ్డంకులు సృష్టిస్తున్నాయని విమర్శించారు. మహిళల అభివృద్ధి, సంక్షేమం పట్ల ప్రతిపక్షాలకు చిత్తశుద్ధి లేదని, మహిళలు వారి వైఖరిని గమనించాలని పిలుపునిచ్చారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించడం మోదీ ప్రభుత్వ చారిత్రక నిర్ణయమని తెలిపారు. 2014 నుంచి కేంద్రంలో అధికారంలో ఉన్న మోదీ ప్రభుత్వం మహిళల సాధికారత కోసం అనేక కార్యక్రమాలు అమలు చేస్తోందని పేర్కొన్నారు. మహిళలకు సముచిత స్థానం కల్పించడమే లక్ష్యంగా ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలు నిర్వహించి బిల్లును ఆమోదించే ప్రయత్నం చేసినప్పటికీ, ప్రతిపక్షాలు సహకరించలేదని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించిన పార్టీలకు మహిళలు తగిన గుణపాఠం చెప్పాలని కవిత పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే బోడిగే శోభక్క, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుర్రాల నిర్మల దేవి, మహిళా మోర్చా అధ్యక్షురాలు చొప్పరి జయశ్రీ, సాధినేని లావణ్య, గుగ్గిళ్ల మంజుల, గొట్టిముక్కల ఉమారాణి, పెద్దపల్లి శ్రీలేఖ, తాటి ప్రభావతి, కొలిపక రమ్య, వేముల కవిత, దేవసాని సరస్వతి, పొన్నం లక్ష్మి, తెల్ల లక్ష్మి, ఎన్నం లక్ష్మి, బారి అపర్ణ, నాంపల్లి రేణుకతో పాటు మేయర్ కొలగాని శ్రీనివాస్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

# హిందూ సమ్మేళనం విజయవంతానికి భారీ వాహన ర్యాలీ

**18న తిమ్మాపూర్ ఉప మండలంలో ఘన ఏర్పాట్లు**



కరీంనగర్, ఏప్రిల్ 17: తిమ్మాపూర్ ఉప మండలంలో ఈనెల 18న నిర్వహించనున్న హిందూ సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని కోరుతూ శుక్రవారం అలుగునూరు నుంచి కొత్తపల్లి వరకు భారీ వాహన ర్యాలీ నిర్వహించారు. సామాజిక సమరత తెలంగాణ ప్రాంత కార్యదర్శి పుల్లూరి రామారావు ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, హిందూ సమాజంలో ఐక్యతను పెంపొందించేందుకు ఈ సమ్మేళనం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉప మండలం పరిధిలోని అలుగునూరు, మహాత్మా నగర్, తిమ్మాపూర్, పోరండ్ల, ఇందిరానగర్, నుస్తులాపూర్, కొత్తపల్లి గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. శనివారం సాయంత్రం 5 గంటలకు రామకృష్ణ కాలనీలోని సుభాష్ నగర్ ప్రాంతంలో గల శ్రీ అనంత పద్మనాభ స్వామి దేవాలయ ప్రాంగణంలో ఈ హిందూ సమ్మేళనం ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయని వెల్లడించారు. శ్రీ అనంత పద్మనాభ స్వామి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమంలో సాంస్కృతిక కార్యక్రమాలు, ప్రముఖ వక్తల సందేశాలు ప్రధాన ఆకర్షణలుగా ఉంటాయని తెలిపారు. ఈ ర్యాలీలో ఉత్సవ సమితి కమిటీ సభ్యులు, యువకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

EDITED, PRINTED PUBLISHED AND OWNED BY YAMSANI SHIVA KUMAR, PRINTED AT SRI BALAJI PRINTING PRESS, H.NO : 4-4-85, KARIMNAGAR-504001 DISTRICT TELANGANA PUBLISHED AT H.NO:6-2-7A, HANMANWADA, JAGITYAL, VIL & MDL.DIST.KARIMNAGAR 506327 EDITOR : YAMSANI SHIVA KUMAR RNI NO: TELTEL/2014/55206, CELL NO: 79-89867251 Email: janathadaily@gmail.com